బంగారు గూడు - వజ్రాల గుడ్లు

అజీజ్

"సాయంత్రం త్వరగా రండి!" అంది సద్గుణ భర్తకు టై అందిస్తూ.

"ఏమిటి విశేషం?" అడిగేడు మంజునాథ్ కుతూహలంగా.

"ప్లాజాలో కొత్తపిక్చర్ వచ్చిందట!"

టై ముడివేసుకుంటూ, "ఏ పిక్చర్?" అడిగాడు మంజునాథ్.

"ది ఓమన్! మంచి థ్రిల్లింగ్ స్టోరీ అట. పక్కింటి ఇంజనీర్ గారి భార్య చెప్పింది. రాత్రి సెకండ్ షో కెళ్ళారట వాళ్ళు. ఆ పిక్చరులోని భయంకర దృశ్యాలు జ్ఞాపకమొచ్చి రాత్రంతా నిద్రపట్టలేదుట ఆవిడకి."

"ఐతే నువ్వూ ఈరాత్రి జాగారం చెయ్యదలచుకున్నావన్నమాట" అన్నాడు మంజునాథ్ నవ్వుతూ.

"మీకా భయం అక్కర్లేదులెండి. చదువుకునే రోజులలో నాకు 'ఆడపులి' అనే బిరుదు ప్రదానం చేశారు కొంతె

కోణంగులు. అదిసరేగానీ, ఐదున్నరకల్లా వచ్చేయాలి. అర్థమయిందా?"

"రాణీవారు ఆజ్ఞాపించడం, ఈ దాసుడుంగారు నిరాకరించడమూనా? అలాగే మేడమ్! టాకీసుకు ఫోన్ చేసి రెండు టికెట్లు రిజర్వ్ చేయించి వుంచు."

కారు తాళంచెవులుతీసి అందించింది సద్గుణ. మంజునాథ్ బయటకివచ్చి, పోర్టికోలో తళతళ మెరుస్తున్న చవర్లెట్ కారెక్కాడు. గుమ్మంలో నిలుచున్న భార్యకు టాటా చెబుతూ ముందుకి పోనిచ్చాడు.

పాండీబజారులో వుంది అతని వజ్రాల దుకాణం! తండ్రి యీమధ్యే గతించడంతో, లక్షల పెట్టుబడితో సాగే ఆ వ్యాపార భారమంతా అతనిమీద పడింది. తండ్రికి ఒక్కడే కొడుకు. బాదరబందీలులేవు. కొత్తగా పెళ్లయింది. బాల్యంనుంచి తండ్రిదగ్గర వ్యాపారంలో రాటుదేలాడు గనుక బిజినెస్‌లో అతనికే యిబ్బందులూ ఎదురు కావడంలేదు.

దుకాణం అనేక భద్రతా యేర్పాట్లతో నిండివుంది గనక అందులో దొంగలు పడతారన్న చింతకూడా అతని దరిజేరదు. ఇరవై లక్షలు విలువజేసే వజ్రాభరణాలెప్పుడూ ఆ దుకాణంలో నిక్షేపంగా నిదురబోతూ వుంటాయి. షాపు తలుపులకూ, కిటికీలకూ బర్గ్లర్ అలారమ్స్ ఫిట్ చేసి వున్నాయి.

బయట షోకేసుల్లో శక్తివంతమైన మైక్రోఫోన్స్ బిగించి వున్నాయి.

దుకాణం బయటనిల్చుని ఆభరణాలు చూస్తూ ఎవరేం మాట్లాడుకుంటున్నారో ఊపిరితోసహా షాపులోపల కూర్చుని స్పష్టంగా వినవచ్చు. ఒక్కోసారి ఫుట్ పాత్

మీద నడిచేవారి మాటలుకూడా వినిపిస్తుంటాయందులో.

మంజునాథ్ పెర్సనల్ ఆఫీసులో, అత్యంతాధునిక మయిన ఓ బుల్లెట్ ప్రూఫ్ సేఫ్ గోడలో ఓగించివుంది. చాలా ఖరీదయిన ఆభరణాలు దాచివుంటా యందులో. ఎంతోగొప్ప కస్టమర్స్ వస్తేతప్ప వాటిని బయటికితీసి చూపించరు.

ఆ దుకాణం కొల్లగొట్టడానికి ఆరుసార్లు ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నాలు ఫలించడం అటుంచి, ఆ దొంగలిప్పటికీ వివిధ జైళ్లలో మగ్గుతున్నారు. అందులో ఇద్దరు దొంగలు కేవలం షోకేస్ ముందు నిల్చుని, చెవులు కొరుక్కున్న పాపానికే పట్టుబడిపోయారు.

వ్యాపారంలో మంజునాథ్‌కు సహాయకులుగా జయదీప్, శివానందం అనే యిద్దరు ఉద్యోగులు పనిచేస్తున్నారక్కడ. శివానందం వృద్ధుడు. అతని తండ్రి హయాం నించీ అక్కడే పనిచేస్తూ విశ్వాసపాత్రుడిగా, అనుభవశాలిగా పేరు గడించాడు.

జయదీప్ ముప్ఫయ్యేళ్ల యువకుడు. చురుకయినవాడు. ఒకవిధంగా ఆ షాపులో సెక్యూరిటీ విధులు నిర్వహించేది అతనే! దుకాణంలోకి వచ్చేపోయే కస్టమర్లపై నిఘా వుంచడం, మైక్రోఫోన్స్ రిసీవింగ్ సెట్లముందుకూర్చుని వారి సంభాషణలు వినడం అతని డ్యూటీ.

అతని తెలివితేటలవల్లే ఒకసారి షాపులో ఆభరణాలు పరిశీలిస్తున్నట్టు నటిస్తూ ఓ వజ్రపుటుంగరం కాజేయబోయి పట్టుబడిందో ఘరానా స్త్రీ! మరోసారి సెల్లెకెన్స్ స్వాహా చెయ్యడానికి నక్కజిత్తులు వేసిన ఓ పెద్దమనిషి రెడ్ హేండెడ్‌గా పట్టుబడ్డాడు. మంజునాథ్‌కు జయదీప్ శక్తి సామర్థ్యాలపై పూర్తి నమ్మకం వుంది.

షాపుముందు ఫుట్ పాత్ పక్కన కారు పార్క్ చేసి దిగాడు మంజునాథ్. సరిగ్గా అదే సమయంలో అతని దృష్టి షాపు షో కేస్ యివతల నిల్చుని ఏదో మాట్లాడుకుంటున్న ఓ వ్యక్తిమీదా, అతని పక్కనున్న అందమైన యువతిమీదా నిలిచింది.

ఆ వ్యక్తికి సుమారు నలభయ్యేళ్ళుంటాయి. ఖరీదైన సూటు. సన్నగా గీసుకున్న గడ్డం. కణతలదగ్గర నెరసిన జుత్తు.

యువతి గొప్పింటి బిడ్డలా నాజూకుగావుంది. గులాబీ రంగు ఒళ్ళు. చారడేసి కళ్ళు. కోలమొహం. అయితే ఆమెచూసే చూపుల్లోనూ, కదలికల్లోనూ ఏదో అసహజత్వం కనిపించింది మంజునాథ్ కు. కారు అద్దాలు పైకెత్తి డోర్స్ లాక్ చేస్తూ వాళ్ళవేపే చూడసాగాడు.

ఆ వ్యక్తి ఆమె చెయ్యిపట్టుకుని, "ప్రమోదా! నేను చెప్పిన వజ్రాలషాపు ఇదే!" అంటున్నాడు. అతని కుడి చేతిలో ఓ బ్రీఫ్ కేసుకూడా వుంది. దాన్ని గుండెకదమి పట్టుకుంటూ, "భగవంతుడి దయవల్ల మనమిక్కడికి సురక్షితంగా చేరుకున్నాం! ఇక భయపడే అవసరం లేదు. అంతా మనమనుకున్నట్టే జరుగుతుంది. పద. లోపలికెళ్ళి షాపు యజమాని మంజునాథ్ ను కలుసుకుందాం!"అన్నాడు ఆమెకు ధైర్యం చెబుతూ.

ఆ యువతి అతని ఒక్కమాటకూ బదులివ్వడంలేదు. అసలా మాటలామెకు వినిపించనట్టే శూన్యంలోకి చూస్తున్నట్టు షోకేస్ వైపు చూస్తూ నిల్చుంది.

అతనామె భుజంమీద చెయ్యివేసి నడిపించుకుంటూ షాప్ లోకి తీసికెళ్ళాడు. మరబొమ్మకిమల్లే యాంత్రికంగా అడుగులువేస్తూ అతని వెంట లోపలికెళ్ళింది.

వారి చర్యలుచూస్తూ అక్కడే నిలుచున్న మంజునాథ్ కి ఆ యువతి ప్రవర్తన చాలా విచిత్రంగా తోచింది. ఎవరు వాళ్లు? అతనామె కేమౌతాడు? తండ్రా? ఆలోచిస్తూ షాప్ లోకి చూశాడు.

వాళ్ళు లోపలికి ప్రవేసించగానే కౌంటరులో కూర్చున్న శివానందం వినయంగా లేచివచ్చి, "దయచేయండి, దయచేయండి! అమ్మగారి కేమయినా చూపించమంటారా" అడిగాడు నమ్రతగా.

"సారీ! మేము బేరం చెయ్యడానికి రాలేదు. మంజునాథ్ గారిని కలుసుకోడాని కొచ్చాం!" అన్నాడతను బ్రీఫ్ కేస్ గుండెకదుముకుంటూ.

"వారింకా షాపుకు రాలేదు...." శివానందం వాక్యం పూర్తికాకముందే మంజునాథ్ వడివడిగా నడుస్తూ షాపులో అడుగుపెట్టాడు.

"అదుగో, మాటల్లోనే వచ్చారు. నూరేళ్లాయుఃషు" అన్నాడు శివానందం.

మంజునాథ్ వాళ్లను పట్టించుకోనట్టు, బూట్లు టకటక చప్పుడు జేసుకుంటూ తన ఆఫీసులోకెళ్లి, ఈజీ ఛేర్ లో చతికిలబడ్డాడు. దానిపక్కనే సెక్యూరిటీ కేబిన్ లో కూర్చున్న జయదీప్ బైట మాట్లాడుకుంటున్న వారి మాటలు రిసీవింగ్ సెట్ పై వింటూనేవున్నాడు. ఆ యువతినీ, ఆ వ్యక్తినీ గమనిస్తూనే వున్నాడు.

అంతలో శివానందం మంజునాథ్ గదిలో ప్రవేశించి- "ఎవరో దక్షిణామూర్తి గారట. చాలా ముఖ్యమైన పని మీద మిమ్మల్ని కలుసుకోవాలంటున్నారు. పంపించమంటారా" అన్నాడు.

సిగరెట్ అంటించి, "పంపించండి!" అన్నాడు మంజునాథ్.

శివానందం వెళ్ళిన రెండు నిమిషాలకు వాళ్ళిద్దరూ లోన అడుగుపెట్టారు. ఇప్పటికి ఆ వ్యక్తి చెయ్యి ఆమె భుజంమీదే వుంది. అతని సాయంలేనిదే ఆమె నడవలేదా? అనుకుంటూ తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో లేచి, "రండి, రండి! ప్లీజ్, టేక్ యువర్ సీట్స్!" అన్నాడు మంజునాథ్.

దక్షిణామూర్తి ముందు ఆ యువతిని కూర్చోబెట్టి, తను కూర్చుని—"మంజునాథ్ గారూ! మీ గురించీ మీ వ్యాపారం గురించీ చాలా విన్నాను. ఐతే, వ్యక్తిగతంగా కలుసుకునే అవసరం ఇప్పుడే కలిగింది. ఈ అమ్మాయి నా అన్నకూతురు. ప్రమోద. ప్రస్తుతం నేనొక వస్తువు అమ్మే ప్రయత్నంలో వున్నాను. దాన్ని కొనగలిగే కస్టమర్లను వెతికిపెట్టడంలో మీ సహాయం కావాలి మాకు. ఐతే, వీలైనంత త్వరగా ఈ పని జరగాలి. సాధ్యపడితే ఈ రోజే అమ్మకం జరిగి, డబ్బు మా చేతికందితే మరీ మంచిది!" అన్నాడు.

మంజునాథ్ సిగరెట్ చివరిదమ్ము లాగి, ఏష్ట్రేలో నొక్కుతూ-"ముందా వస్తువు చూపించండి! నా స్తోమతకు తగదైతే నేనే కొనేస్తాను. లేదా, తెలిసిన కస్టమర్లకు కబురు పెడతాను. దేశంలోని ప్రముఖ ఆభరణాల అభిమానులంతా నాకు తెలుసు. వారు సేకరించిన అనేక విలువైన వస్తువులు నా చేతులమీదే అమ్మబడ్డాయి. అందుకు నా కమిషన్ త్రీ పర్సెంట్ తీసుకుంటాను" అన్నాడు బిజినెస్ ధోరణిలో.

దక్షిణామూర్తి తలూపి, "అలాగే!" అంటూ చేతిలో

వున్న బ్రీఫ్ కేస్ టేబిల్ మీద పెట్టి, లాక్స్ తెరవ సాగాడు.

ఆ యువతిమాత్రం బెల్లంకొట్టిన రాయిలా కూర్చు నుంది. వాళ్లతో గానీ, వాళ్ల మాటలతో గానీ ఎటువంటి ప్రమేయం లేకుండా ఎదురుగావున్న గోడ కేసి చూస్తోంది. ఆ అమ్మాయి పిచ్చిదైనా అయుండాలి. లేదా, చెవిటిదీ-మూగదీ అయినా అయుండాలి.

అంతలో దక్షిణామూర్తి బ్రీఫ్ కేస్ తెరిచాడు. అందులో ఓ ఎరుపురంగు మఖమల్ పెట్టెవుంది.

దాన్ని ఇవతలికి తీసి, "మంజునాథ్ గారూ! నేను చూపించబోతున్న అమూల్యమైన ఆ వస్తువు నిజానికి నాది కాదు. అమ్మాయి ప్రమోదే దానికి సర్వాధికారిణి. నగరంలో ఎందరో వజ్రాల వ్యాపారులున్నారు. నాకు ఎవ్వరిమీదా నమ్మకంలేదు. అందుకే మీ దగ్గరికి వచ్చాం!" అన్నాడు దక్షిణామూర్తి.

"నా పట్ల మీ కున్న సదభిప్రాయానికి థాంక్స్!" అంటూ కుతూహలంగా ఆ పెట్టెవైపు చూశాడు మంజునాథ్.

దక్షిణామూర్తి నెమ్మదిగా పెట్టెమూత పైకెత్తాడు. అంతే!

దాంట్లోవున్న వస్తువులు చూడగానే ఒక్కసారి వూపిరి ఆగినట్టు తోచింది మంజునాథ్ కు. ఆశ్చర్యంతో అతని కళ్ళు విప్పారేయి!

2

పెట్టెలోపల స్వచ్ఛమైన బంగారంతో జేసిన ఓ పిచ్చుక గూడుంది. దాని మధ్య అచ్చు పిచ్చుకగుడ్ల

ఆకారంలోవున్న ఐదు వజ్రాలగుడ్లు మెరుస్తున్నాయి ధగధగ!

రంగురంగుల వజ్రాలు ఒకదానినొకటి నేర్పుగా అతికించి, అచ్చం గుడ్ల ఆకారాల్లో రమ్యంగా తయారుజేశారు. మంజునాథ్ తన జీవితంలో రకరకాల వజ్రాలూ, ఆభరణాలూ చూశాడు. కాని, ఈ రోజు చూస్తున్న అద్భుత పనితనం అదివరకెన్నడూ చూసి ఎరగడు.

ప్రపంచంలోని ప్రముఖ ఆభరణాల చరిత్రలన్నీ అతనికి క్షుణ్ణంగా తెలుసు. ఆ గుడ్లను చూడగానే ఎప్పుడో చదివిన ఇండోనీషియా ఆభరణాల చరిత్ర లీలగా కదలాడింది అతని కళ్ల ముందు.

కొన్నివందల సంవత్సరాల క్రితం ఇండోనీషియాలోని ఒక సంస్థానాన్ని కిట్టకచోరణ్ అనే రాజు పరిపాలించేవాడు. నాలుగు పెళ్ళిళ్లు చేసుకున్నా అతనికి సంతానం కలగలేదు. ఒక తపస్వి సలహాపై, సింగపూర్ నుండి మేలి రకానికి చెందిన వజ్రాలు తెప్పించి, వాటిని గుడ్లరూపంలో మలిపించి, మంగారు గూడులో ఉంచి రాజమందిరంలోని దేవాలయంలో, దేవతాపాదాల ముందుంచి, ప్రార్థనలు జరిపించాడు.

ఏడాది తిరక్కుండానే ఆ రాజుకు యిద్దరు కవల పిల్లలు పుట్టారు. దాంతో, ఆ మహిమ జ్ఞాపకార్థం ఆ వజ్రాలగుడ్లు ఆ మందిరంలోనే వుంచబడ్డాయి.

కొన్నేళ్ల తరవాత అనుకోకుండా ఆ సంస్థానంలో ప్రజలు తిరుగుబాటు లేవదీశారు. ఎటుచూసినా హత్యలూ, దౌర్జన్యాలూ కొనసాగాయి. అప్పుడే మందిరంలోంచి వజ్రాలతో సహా ఆ బంగారుగూడు మాయమైంది.

తరవాత యెంత గాలించినా వాటి ఆచూకీ లభించ లేదు. ఇన్నేళ్ల తరవాత ఆ అమూల్యసంపద యిప్పుడు మంజునాథ్ ముందు మెరుస్తోంది. భరింపరాని ఎక్సైట్ మెంట్‌తో అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆ వ్యాపారంలో అతనికున్న అనుభవం వెంటనే వాటి మూల్యాన్ని కట్టేసింది.

ఎనభై లక్షలు!

అనుకోకుండా అతనిలో ఓ అనుమానం మొలకెత్తింది.

అవి నిజమైనవా? నకిలీవా?

"క్షమించాలి! వీటిని పరీక్షించడానికి మీకేమీ అభ్యంతరం లేదుకదా?" అడిగాడు దక్షిణామూర్తిని.

అతను ఇబ్బందిగా మొహం పెట్టి, "సరే, మీ ఇష్టం!" అన్నాడు.

బల్లసొరుగులోంచి డైమండ్ టెస్టర్ తీసి, పది నిమిషాలపాటు ఆ గుడ్లనీ, గూడునీ క్షుణ్ణంగా పరీక్షించాడు మంజునాథ్.

అన్నీ స్వచ్ఛమైనవే! మోసానికి తావులేదు!

దక్షిణామూర్తి నవ్వి "ఇప్పుడైనా అనుమానం తీరిందా?" అడిగాడు.

మంజునాథ్ సాలోచనగా తలూపి, "వీటి ఖరీదు యెంతో తెలుసా మీకు?" అడిగాడు.

"వస్తువుల విలువలూ, ఖరీదు కాలానుగుణంగా మారుతుంటాయి. వీటి విలువ కస్టమర్లే నిర్ణయిస్తారు. రసపిపాస గలవాళ్లెవరికైనా ఇవి నచ్చితే కోటి రూపాయలు చెల్లించడానికూడా వెనుదీయరు!"

"నిజమే! కాని, మార్కెట్ రేట్ ప్రకారం వీటి

మూల్యం ఎలభై లక్షలే వుంటుందని నా అంచనా!"

"కావచ్చు! మీ అనుభవాన్ని బట్టి అంచనా వేశారు. సరే, అదే వెలకు అమ్మేయ్యండి. ఈ రోజే!"

"సారీ! ఒక్క రోజులో జరిగే పని కాదిది. ఇరవై లక్షల వ్యవహారమైవుంటే, నేనే వీటిని కొనేవాణ్ణి. ఇది ఎనభై లక్షల వ్యవహారం! కస్టమర్లను వెదకవలసి వుంటుంది. ఇటువంటి వస్తువులు కొనే స్తోమత గలవాళ్ళూ, అభిరుచి గలవాళ్ళూ దేశంలో ఏ డెనిమిది మందికి మించివుండరు."

"ఒప్పుకుంటాను. కాని, మేము వెంటనే వీటిని అమ్మేయాలి. ఎక్కువ రోజులు ఆగే ఓపిక లేదు. డబ్బు ఈ రోజే మా చేతికందే పక్షంలో డెభైఐదు లక్షలకే అమ్మేస్తాం! ప్రమోదకు ప్రస్తుతం డబ్బు అవసరం చాలా వుంది!"

మంజునాథ్ పెదవి విరిచి "ఈ ఒక్క రోజులో అంత పెద్ద బేరం కుదరడం కష్టం! మీకంతగా డబ్బు అవసరం వుంటే, నా దగ్గర వడ్డీలేకుండా లక్షరూపాయలు తీసుకోండి. బదులుగా వీటిని నా దగ్గరుంచండి. ఆ మొత్తానికి మీకు రసీదు యివ్వబడుతుంది. ఆ లోపల నేను కస్టమర్ల కోసం గాలింపు ప్రారంభిస్తాను. వారం రోజుల్లో మీ పని చేసిపెట్టగలనన్న నమ్మకం ఉంది నాకు. ఏమంటారు?" అడిగాడు.

దక్షిణామూర్తి కాసేపు ఆలోచించి—"ఏం చేస్తాం? అవసరం మాది. అలాగే కానివ్వండి" అన్నాడు.

"అన్నట్టు మరోవిషయం చెప్పడం మర్చాను."

"ఏమిటిది?"

"ఇంత విలువైన వస్తువులు నా దగ్గరుంచుకోడం సామాన్య విషయంకాదు. ఇవి మీ స్వంతమో, కాదో

నాకు తెలీదు. రుజువు చెయ్యాలి. ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. మా బిజినెస్ రూల్సు కూడా పాటించాలి కదా?"

"ఆల్‌రైట్! మీకెలాంటి నిదర్శనాలు కావాలి?" అడిగాడు దక్షిణామూర్తి.

"రసీదులూ, డాక్యుమెంట్లూ మొదలైన వేవైనా వుంటే...."

"ఓ.కే! నే వెళ్లి మా లాయర్ని పిల్చుకొస్తాను. అతని దగ్గరే వున్నాయి డాక్యుమెంట్లూ, రసీదులూ!"

"అంతదూరం మీరు వెళ్లడం దేనికి? ఇక్కణ్ణించి ఫోన్ చేసి, తీసుకురమ్మంటే చాలదూ?"

దక్షిణామూర్తి రిస్టువాచీ చూసుకుని, "ఈ సమయంలో అతను కోర్టులో వుంటాడు. బిజీలాయర్. టాక్సీలో వెళ్లి తీసుకొస్తాను. అంతవరకూ ప్రమోద యిక్కడే వుంటుంది. మళ్ళీ వీటిని మోసుకెళ్లడం దేనికి? మీ దగ్గరే వుంచి, తాత్కాలికంగా రసీదు రాసివ్వండి చాలు" అన్నాడు.

మంజునాథ్ తలూపి, రిసీట్‌బుక్ అందుకుని, తాత్కాలిక రసీదు రాసి అందించాడతనికి. తరవాత ఆ వజ్రాల గుడ్డను గూడులో వుంచి, గోడలోవున్న సీక్రెట్ సేఫ్‌లో దాచేశాడు.

అంతవరకూ బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్న ప్రమోద భుజంతట్టి—

"అమ్మా! ప్రమోదా! ఇక నువ్వేం భయపడవద్దు. అంతా సవ్యంగా జరిగిపోతుంది. నేను గంటలోపల వచ్చేస్తాను. అంతవరకూ నువ్విక్కడే కూర్చో!" అంటూ లేచాడు దక్షిణామూర్తి.

ఆ యువతి నోటినుంచి పల్లెత్తు మాటలేదు. శూన్యంలోకి

చూస్తున్నట్టు అతనివైపు చూస్తోంది. అతను కూడా ఆమె జవాబుకోసం యెదురు చూడకుండా గబగబ గదిలోంచి వెళ్లిపోయాడు. ఆ అమ్మాయి కన్నార్పకుండా తలుపు వైపే చూడసాగింది.

మంజునాథ్ కొద్దిగా దగ్గి, "కాఫీ, కూల్ డ్రింక్స్ ఏమైనా తీసుకుంటారా?" అడిగాడు.

ఐనా, ఆమెలో ఉలుకూ, పలుకూ లేదు! తలతిప్పి అతనివైపు చూడనైనా లేదు!

పేపర్ వెయిట్ అందుకుని, గట్టిగా బల్లమీద వాయించాడు మంజునాథ్. ఆ శబ్దానికి బైట కూర్చున్న శివానందం పరిగెత్తుకొచ్చాడుగానీ, ఆ అమ్మాయి మాత్రం శిలా ప్రతిమలా అలాగే కూర్చునుంది.

దాంతో ఆమె మూగదీ, చెవిటిదీ అయ్యుంటుందని నిశ్చయించుకున్నాడు మంజునాథ్.

3

గంట గడిచింది.

దక్షిణామూర్తి రాలేదు!

రెండుగంటలు దాటాయి.

ఐనా అతని ఐపులేదు!

అసహనంగా రిస్టువాచీ చూసుకున్నాడు మంజునాథ్. మధ్యాహ్నం మూడుగంటలు!

ప్రమోద యిప్పటికీ అలాగే కూర్చునుంది రాతిబొమ్మలా.

లాయర్ని పిల్చుకొస్తానని వెళ్ళిన వ్యక్తి యింకా రాలేదేం? ఏమయ్యాడు? రావడం ఆలస్యమైతే కనీసం ఫోన్ జేసి చెప్పవచ్చుగా? మరోగంట ఓపిగ్గా కాచుకున్నాడు మంజునాథ్. ఐనా, దక్షిణామూర్తి వస్తున్న జాడలేదు.

ఇక అతనిలో సహనం చచ్చిపోయింది. లేచి కాలు గాలిన పిల్లిలా గదిలో పచార్లు చెయ్యసాగాడు. ఇప్పుడు ప్రమోద కూడా కుర్చీలో అటూ ఇటూ కదులుతోంది. ఇప్పుడేం చెయ్యాలి? ఆ వస్తువులైతే వాల్ సేఫ్‌లో భద్రంగా వున్నాయి. కాని, ఈ అమ్మాయినేం చేసేది? వాళ్ల అడ్రసు కూడా తనకు తెలీదే? అడిగి తెలుసుకుందామన్నా ఆ అమ్మాయి మూగదీ, చెవిటిదీ! ఏమిటి దారి యిప్పుడు?

ఆలోచిస్తూ చటుక్కున ఆమె ముందాగాడు మంజునాథ్. ప్రమోద మొదటిసారి తలెత్తి అతనివైపు చూసింది. ఆశ్చర్యంతో మంజునాథ్ నోరు తెరుచుకుంది. ఆమె కళ్లలో కన్నీళ్ళు! బహుశా, పినతండ్రి రానందుకేమో?

"ప్రమోదా!" పిల్చాడు ఆప్యాయంగా.

అతని పెదాల కదలికవల్ల గ్రహించివుంటుంది తన పేరు ఉచ్చరించాడని. దీనంగా చూస్తూ తలూపింది.

"భయపడక! చిన్నాన్న త్వరలోనే వచ్చేస్తారు. కాస్త ఓపికపట్టు." అన్నాడు మంజునాథ్ ధైర్యం చెబుతూ.

ప్రమోద కళ్ళు తుడుచుకుని, తలుపువైపు చూడసాగింది.

సాయంత్రం ఐగుగంటలు గడిచినా దక్షిణామూర్తి ఐపు లేకపోయేసరికి యిక అతనిలో ఆశా, ఓపికా నశించాయి. అతను రాకపోడానికి అనేక కారణాలు తడుతున్నాయి. ఆక్సిడెంటుకు గురై ఆస్పత్రిపాలయ్యాడేమో? లాయర్ దొరక్క అతనికోసం తిరుగుతున్నాడేమో! లేదా, ఏదైనా ప్రమాదంలో ఇరుక్కున్నాడేమో?

వెళ్లేటప్పుడు అతని అడ్రసూ, అతని లాయర్ పేరూ అడగనందుకు తనను తాను తిట్టుకున్నాడు మంజునాథ్.

చీకటి పడబోతోంది. ఇప్పుడీ అమ్మాయి నేం చెయ్యాలి? ఆమె నెలా ఓదార్చాలి? సడన్ గా ఓ ఆలోచన తట్టి, టేబిల్ మీద టెలిఫోన్ దగ్గరికి లాక్కున్నాడు. తన యింటికి రింగ్ చేసి రిసీవరందుకున్నాడు.

అవతల పనిమనిషి విమల పలికింది.

"విమలా! మీ అమ్మగారున్నారా యింట్లో?"

"ఉన్నారండి!"

"లైన్లోకి రమ్మను."

రెండునిమిషాల తరవాత సద్గుణ కంఠం వినిపించింది.

"టికెట్లు రిజర్వ్ చేయించాను. త్వరగా వచ్చెయ్యండి."

"నీ సినిమా సంగతెలా వున్నా, నేనిప్పుడో చిక్కులో యిరుక్కున్నాను. నీ సహాయం కావాలి. వెంటనే షాప్ కు బైలుదేరి రా!"

"ఏం జరిగింది? ఎందుకలా వున్నారు?" సద్గుణ కంఠంలో ఖంగారు.

"చెబుతాను. వెంటనే వచ్చెయ్!"

పావుగంటలో వచ్చింది సద్గుణ,

"ఏమండీ, ఏం జరిగింది? యెందుకు పిలిచారు నన్ను?" అంటూ హడావుడిగా ఆఫీసులో అడుగుపెట్టింది సద్గుణ.

మంజునాథ్ ఆమెని కూర్చోమన్నట్టు సైగచేసి ముందు ప్రమోదను పరిచయం చేశాడు. తరవాత జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించి, "ఆ దక్షిణామూర్తి ఇప్పుడప్పుడే వస్తాడన్న నమ్మకం లేదు. నువ్వీమెని యింటికి తీసికెళ్ళి ధైర్యం చెబుతూవుండు. ఆ లోగా నేనతని గురించి ఆరా

తీస్తాను" అన్నాడు.

సద్గుణ భర్తను క్షణంగా అర్థంచేసుకున్న యిల్లాలు. ఆప్యాయంగా ప్రమోద చెయ్యిపట్టుకుని లేచింది. ఆమె తన భార్య అనీ, ఆమెవెంట తమ యింటికెళ్లమని సైగలతోనూ నోటితోనూ నచ్చచెప్పాడు మంజునాథ్. ఆమె అతని సంజ్ఞలు అర్థంజేసుకుని తలూపింది.

వాళ్ళిద్దరూ బయటకెళ్ళగానే జయదీప్ ని పిలిచి—"నువ్వు టాక్సీలో వాళ్ళకారును వెంబడించు. ఇల్లు చేరగానే, దూరంగావుండి, ఇంటిమీద నిఘావేసి వుంచు. వాళ్ళకేదయినా ప్రమాదం జరుగుతుందేమోనని నా మనసు కీడును శంకిస్తోంది" అన్నాడు మంజునాథ్.

జయదీప్ తలూపి బయటికి నడిచాడు.

ఏడుగంటలవరకూ అక్కడే కూర్చుని ఎదురుచూశాడు మంజునాథ్.

దక్షిణామూర్తి రాలేదు!

అతని ఆచూకీ ఎలా తెలుసుకోవాలా అని తీవ్రంగా యోచిస్తున్న అతనికిసడన్ గా జ్ఞాపకంవచ్చాడు డిటెక్టివ్ దుర్యోధన్. వెంటనే షాపుకట్టేసి అతని ఇంటికెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. వెళ్లేముందు భార్యకు ఫోన్ చేసి చెబుదామని రిసీవరెత్తి ఇంటికి రింగ్ చేశాడు.

అవతల ఫోన్ మోగుతున్నశబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. కానీ ఎవ్వరూ యెత్తడంలేదు. ఆశ్చర్యం వేసింది మంజునాథ్ కు. అయిదునిమిషాలు ట్రైచేసినా అవతలినుంచి రెస్పాన్స్ లేదు. వాళ్ళక్కడనుంచి యింటికెళ్ళి గంటన్నర అయింది. సద్గుణ ప్రమోదను తీసుకుని మరెక్కడకీ పోయే ప్రసక్తిలేదు. కనీసం పనిమనిషి విమలకూడా యెందుకు యెత్తడంలేదు ఫోను? కొంపదీసి....

ఆ ఆలోచన రాగానే మంజునాథ్ గుండెలో దడ ప్రారంభమయింది. చకచక డిటెక్టివ్ దుర్యోధన్ ఇంటికి రింగ్ చేసి, రిసీవరందుకున్నాడు.

అవతల అతని అసిస్టెంట్ అర్జున్ మాట్లాడుతున్నాడు.

మంజునాథ్ తనని పరిచయం చేసుకుని, వెంటనే దుర్యోధన్‌తో మాట్లాడాలని కోరాడు. రెండు నిమిషాల తరవాత వచ్చాడు డిటెక్టివ్ లైన్‌లోకి.

మంజునాథ్ అతనికి జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించి, "ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" అడిగాడు ఆందోళనగా.

"షాపుకట్టేసి వెంటనే ఇంటికెళ్ళండి. మేమూ అక్కడికే వస్తున్నాం!" అన్నాడు దుర్యోధన్.

4

కారు పోర్టికోలో ఆపగానే దిగి, గబగబ తలుపును సమీపించాడు మంజునాథ్. కాలింగ్ బెల్ వత్తడానికి లేచిన అతని చెయ్యి అప్రయత్నంగా ఆగిపోయింది. దగ్గరగా చేరవేసుంది తలుపు. మెల్లిగా తోశాడు. కిర్రుమంటూ తెరుచుకుంది. నిశ్శబ్దం!

"సద్గుణా!" పిల్చాడు.

లోపల సూదిపడితే వినిపించే నిశ్శబ్దం!

"విమలా!" పిల్చాడు గట్టిగా.

జవాబు శూన్యం!

తడబడే అడుగులతో ముందు డ్రాయింగ్ రూంలో అడుగుపెట్టాడు. అక్కడ కనిపించిన దృశ్యం అతన్ని రాతిబొమ్మను చేసింది. పనిమనిషి విమల నేలమీద తాళ్ళతో బంధించబడుంది. అరవకుండా నోట్లో గుడ్డలు

కుక్కి వున్నాయి. అతన్ని చూడగానే ఆమె కంఠం లోంచి చిత్రవిచిత్ర శబ్దాలు బయటకి వచ్చాయి.

మంజునాథ్ కళ్లలో భార్యా, ప్రమోదా తళుక్కు మన్నారు. వాళ్ళకేమయిందో అన్న ఆలోచన రాగానే విమల విషయం మరిచి, చటుక్కున వెనుదిరగబోయాడు.

అంతే! మెడ వెనుక ఏదో చల్లగా తగిలి అతని ఒళ్లంతా జల్లుమంది.

"కదలక! ఇది పిస్తోలు!" వెనకనించి వినిపించిందో అపరిచిత కంఠం.

మంజునాథ్ గుండె దడదడ కొట్టుకుంది.

"నెమ్మదిగా వెనక్కి తిరుగు. పిచ్చివేషాలకు పోయావో గుండు నీ మెదడులో తిష్టవేస్తుంది" ఆజ్ఞాపించాడతను.

ఊపిరి బిగబట్టి, నెమ్మదిగా వెనక్కి తిరిగాడు మంజునాథ్. మొహానికి మఫ్లర్ చుట్టుకుని ఓమనిషి నిల్చున్నాడు ఎదుట. చింపిరిజుత్తు, చీకికళ్ళు, దట్టమయిన కనుబొమలు, గళ్లషర్టు, నల్లపాంటు, కాళ్లకి బూట్సు.

"ఎవరునువ్వు?" అడిగాడు మంజునాథ్ అతన్ని ఓరగా చూస్తూ.

"నా వివరాలు తరవాత. ముందు అవెక్కడున్నాయో చెప్పు!"

"అంటే?"

"అర్థంకాలా? గుడ్లు!"

"కోడిగుడ్లా! వంటగదిలో ఫ్రిజ్ లో వుంటాయి. వెళ్ళి తెచ్చుకో."

"నోర్ముయ్! ఆ వజ్రాలగుడ్ల సంగతి నేనడిగేది."

"ఈమధ్య వజ్రాలుకూడా గుడ్లు పెడుతున్నాయా?

కలికాలం! అలాంటిగుడ్లు నేనింతవరకూ చూళ్లేదే?"

"పిచ్చివాగుడు కట్టిపెట్టు! నాకంతా తెలుసు. ఉదయం ఆ ముసలివెధవ బ్రీఫ్ కేసుతో నీ షాపులో అడుగు పెట్టాడు. తరవాత వట్టిచేతులతో వంటరిగా బయటికొచ్చాడు....అవి నీదగ్గరే వున్నాయ్. మర్యాదగా వాటి నెక్కడ దాచావో చెప్పి ప్రాణాలు కాపాడుకో!"

"ముందు నా భార్యసంగతి చెప్పు!", అన్నాడు మంజునాథ్ అసహనంగా.

"పడగ్గదిలో పడుంది."

"చంపావా?"

"లేదు. చెప్పినట్లు వినకుంటే నీకళ్లముందే నీభార్యను కాల్చి పారేస్తాను."

"నీకేం కావాలి?"

"ఆ బంగారుగూడూ, వజ్రాలగుడ్లూ!!"

"వేళాపాళా లేకుండా వాటిని జేబులో వేసుకు తిరుగుతా ననుకున్నావా? అవి షాపులో ఉన్నాయి!"

"పద. నావెంట షాపుకువచ్చి, వాటిని నా కప్పగిస్తావో, నీ కళ్లముందు నీభార్య ఘోరమైన చావు చూస్తావో ఆలోచించుకోడానికి రెండు నిమిషాలు వ్యవధి యిస్తున్నాను. తేల్చుకో!" అన్నాడతను పిస్తోలూపుతూ.

క్షణం యోచించాడు మంజునాథ్. తరువాత తలూపి, "ముందు నా భార్యను చూపించు.ఆమె క్షేమంగా వుందో లేదో నాకెలా తెలుసు?" అన్నాడు.

"ఆల్ రైట్! పద మేడమీదకి" అన్నాడతను పక్కకి జరుగుతూ. మంజునాథ్ మేడమీదకి నడిచాడు. పిస్తోలుతో అతన్ని కవర్ జేస్తూ మేడమీదికెళ్ళాడతను. పైన తెరిచివున్న పడగ్గదిలో అడుగుపెట్టారిద్దరూ. లోపల

సద్గుణా, ప్రమోదా మంచంమీద తాళ్ళతో కట్టిపడేసి వున్నారు. ఇద్దరి నోళ్ళూ గుడ్డలతో బిగదీసి వున్నాయి.

వాళ్ళ నాసితిలో చూడగానే మంజునాథ్ రక్తం మరిగిపోయింది. వెనకాముందూ యోచించకుండా మెరుపులా వెనుదిరిగి, చిఱుతలా ఆ వ్యక్తిమీదకి లఘించాడు.

ఊహించని పరిణామాని కతను బెదిరిపోయి, ట్రిగ్గర్ వత్తేశాడు! గుండు తగలగానే మంజునాథ్ మొదలు నరికిన చెట్టులా కిందకూలాడు. ఆ వ్యక్తి ఖంగారుగా ఆతన్ని సమీపించి,వంగి పరీక్షగా చూశాడు. మంజునాథ్ చావలేదు! అతని గుండెలో దిగవలసిన గుండు కొద్దిలో తప్పి, జబ్బలో దిగింది. ఆ షాక్ వల్లే అతనికి స్పృహ తప్పింది!

అదే క్షణంలో తలుపు దగ్గర చప్పుడు వినిపించి చటుక్కున వెనుదిరిగాడతను.

"ఢాం!"మన్న శబ్దంతో గది మారుమోగింది.

ఆ వ్యక్తి చేతిలోవున్న పిస్తోలు యెగిరి అవతల పడింది. గుండు నిప్పుకణంలా అతని మణికట్టులో దిగబడింది. కెవ్వుమంటూ కింద కూచుండిపోయాడు. తలుపు దగ్గర నిల్చున్న డిటెక్టివ్ దుర్యోధన్, అతని అసిస్టెంట్ అర్జున్ హడావుడిగా లోపలికి వచ్చి, ముందు మంజునాథ్ ని పరిశీలించారు.

అతను బ్రతికేవున్నాడని గ్రహించి, తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ, ఆడవాళ్ళదగ్గరికట్లు విప్పాడు దుర్యోధన్.

"ఆయనెలా వున్నారు?" అంటూ ఒక్క ఉదుటున మంచం దిగింది సద్గుణ.

"నిక్షేపంగా వున్నాడు. గుండు జబ్బలో దిగింది. ప్రాణభయం లేదు" అంటూ, ఫోన్ దగ్గరికి నడిచి,

క్రయింబ్రాంచికి రింగ్ చేసి, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిని సిబ్బందితో తక్షణం అక్కడికి రమ్మని కోరాడు దుర్యోధన్.

తరవాత అడుగులో అడుగు వేసుకుంటూ, దెబ్బతిని కూలబడ్డ నేరస్తుణ్ణి సమీపించి, "ఎవరు నువ్వు?" అడిగాడు తీక్షణంగా.

అతను తలెత్తి క్షణంపాటు డిటెక్టివ్‌ని రెప్ప వాల్చకుండా చూసి, జవాబివ్వకుండా తల దించుకున్నాడు.

"మర్యాదగా అడుగుతుంటే చెప్పాలి. నీలాంటి వాళ్ళ చేత నోరు విప్పించే పద్ధతులు నా దగ్గరున్నాయి" అంటూ గాయపడ్డ అతని మణికట్టుమీద బూటుకాలితో గట్టిగా నొక్కాడు దుర్యోధన్.

అతను బాధతో గావుకేక పెట్టాడేగానీ నోరు విప్ప లేదు. కాలు కొద్దిగా ఎత్తి గట్టిగా తొక్కాడు దుర్యోధన్.

"నన్ను నరికి ముక్కలుజేసినా, మీ ప్రశ్నలకి జవాబివ్వను" అరిచాడతను మొండిగా.

అంతలో ఆంబులెన్స్‌తోబాటు పోలీస్ బలగం వచ్చేసిందక్కడికి.

గాయపడ్డ నేరస్తుణ్ణి చూడగానే ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి కళ్ళు పెద్దవయ్యాయి.

"జోగేంధర్! నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"వీడు తెలుసా మీకు?"

"తెలీకేం? మా పాత అల్లుడే! వివిధ నేరాలకింద నాలుగుసార్లు ప్రభుత్వ ఆతిథ్యం స్వీకరించిన బాపతు!"

దుర్యోధన్ జరిగిందంతా ఇన్‌స్పెక్టర్‌కు వివరించాడు. మంజునాథ్‌కింకా స్పృహరాలేదు. అతన్నీ జోగేంధర్నీ

ఆంబులెన్స్‌లో ఎక్కించాడు.

"వీళ్ళని హాస్పిటల్లో అడ్మిట్ చేసి, దక్షిణామూర్తి గురించి యేమైనా తెలుస్తుందేమో వాకబ్ చేయించండి. నేను హెడ్‌క్వార్టర్స్‌లో మిమ్మల్ని కలుసుకుంటాను. లేదా ఫోన్ చేస్తాను" అన్నాడు దుర్యోధన్.

సార్జంట్ డేవిడ్‌ని, మరికొందరు కానిస్టేబుళ్ళని అక్కడే వదిలి ఆంబులెన్స్‌లో వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్. జరుగుతున్న సంఘటనలు కళ్ళతో చూస్తూ, నోరు కదపలేక భయవిహ్వాలురాలై వున్న ప్రమోదచేత వాళ్ళ వివరాలు సేకరించడానికి ప్రయత్నించసాగాడు డిటెక్టివ్ దుర్యోధన్.

అంతలో అతని అసిస్టెంట్ హడావుడిగా గదిలోకి వచ్చి "సార్, కాంపౌండ్లో క్రోటన్ మొక్కలమధ్య యెవ్వరో స్పృహతప్పి పడున్నారు" అన్నాడు.

అందరూ ఆదరాబాదరా కాంపౌండ్లోకి పరిగెత్తారు. చీకట్లో క్రోటన్ మొక్కలమధ్య బోర్లా పడున్నాడో యువకుడు. దుర్యోధన్ టార్చితీసి వెలిగించాడు. అతని తల వెనక బొప్పి కట్టివుంది. వెల్లకిలా తిప్పి, టార్చి మొహంమీద వేశాడు.

"అరె, ఇతను మా షాపులో పనిచేసే జయదీప్!" అంది సద్గుణ నివ్వెరబోతూ.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది డిటెక్టివ్‌కు. మంజునాథ్ తనకు ఫోన్ చేసి, షాపునించి ప్రమోదా, సద్గుణా కార్లో వెళ్ళగానే వాళ్ళను వెంబండించడానికి జయదీప్‌ను పంపానని చెప్పిన విషయం!

కానిస్టేబుళ్ళ సాయంతో అతన్ని లోపలికి తీసికెళ్ళి, మొహంమీద నీళ్ళు చల్లారు. కాసేపటికి కళ్ళు తెరిచాడు

జయదీప్. అందర్నీ ఆశ్చర్యంగా చూస్తూ లేచి కూర్చున్నాడు.

"జయదీప్! ఏం జరిగింది? నిన్నెవరు స్పృహపో గొట్టారు?" అడిగాడు దుర్యోధన్.

"షాపునించి టాక్సీలో మేడమ్ కారు వెంబడిస్తూ యిక్కడికి చేరుకున్నాను. అప్పటికే చీకటిపడింది. వాళ్ళిద్దరూ యింట్లోకి రాగానే, నేను కాంపౌండ్లో ప్రవేశించి, క్రోటన్ గుబురుమధ్య నిల్చుని చూడసాగాను. కాసేపయాక నా వెనక ఏదో చప్పుడై చటుక్కున తిరిగి చూడబోయాను. మాడు పగిలేలా తలవెనక పడింది దెబ్బ! ఆ షాక్ నించి కోలుకునేలోగా మరోటి పడింది. అక్కడే కూలిపోయాను" చెప్పాడు జయదీప్.

అంతలో ప్రమోద తనకు తీవ్రమైన తలనొప్పి వస్తున్నట్టు చేతో సైగ చేసింది. సద్గుణ ఆమెను నడిపించుకుంటూ మేడమీదికి తీసికెళ్ళింది.

సరిగ్గా అదే సమయంలో హాల్లో కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరో చూడు!" అన్నాడు దుర్యోధన్, అర్జున్తో.

అతను బైటికెళ్ళి, ఓ యువకుణ్ని వెంటబెట్టుకొచ్చాడు. సోఫాలో ఫుల్ సూటులో కూర్చున్న దుర్యోధన్ని చూడగానే, "మంజునాథ్ మీరేనా?" అడిగాడతను.

"కాదు. మీరెవరు?"

"నా పేరు సంతోష్! మంజునాథ్ గార్ని అర్జంటుగా కలుసుకోవాలి."

"ప్రస్తుతం ఆయన ఇంట్లో లేరు."

"నేను ప్రమోదకోసం వచ్చాను."

దుర్యోధన్ కనుబొమలు ముడివడ్డాయి. "ప్రమోదకు

మీ కేమవుతారు?"

"ప్రస్తుతం ఏమీ కాను.

"అంటే?"

"భవిష్యత్తులో మా మధ్య బలీయమైన బంధం ఏర్పడే అవకాశముంది."

"చెప్పేది కాస్త సూటిగా చెప్పండి!"

"ప్రమోద నా బాల్యస్నేహితురాలు. ఇద్దరం కలిసి మెలిసి పెరిగాము. యవ్వనంలో అడుగుపెట్టేసరికి మా స్నేహబంధం ప్రేమబంధంగా మారింది. బాల్యంనించీ ఒకర్నొకరం క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవాళ్ళం గనక జీవితంలోనూ భాగస్వాములం కావాలనుకున్నాము. అంతలో మా కుటుంబం మద్రాసు వచ్చేసింది. ఐనా, నేను ప్రమోద బాగోగులు కనుక్కుంటూనే వున్నాను.

ఆమె సుమారు రెండుకోట్ల ఆస్తికి వారసురాలు. అంతటి అపారసంపద యిచ్చిన భగవంతుడామెకు తీరని అన్యాయం చేశాడు. నోరున్నా మాట్లాడలేదు. చెవు లున్నా వినలేదు. పినతండ్రి ప్రాపకంలో దయనీయంగా జీవిస్తోంది.

దక్షిణామూర్తి పరమనీచుడు. ధూర్తుడు. స్వార్థ పరుడు. ఈ మధ్య ప్రమోదకు చెందవలసిన ఆభరణాలన్నీ ఒక్కొక్కటీ అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని విశ్వాస నీయ వర్గాలద్వారా తెలిసింది నాకు. ప్రమోద నోరులేని ప్రాణి. అతన్ని అడిగే దిక్కులేదు. ఆ అన్యాయాన్ని అరి కట్టడానికి ఆమెకు ఒకరి సహాయం కావాలిప్పుడు.

అందుకే, నేను స్నేహితుడిగా రంగంలోకి దూకాను. ఈ రోజు ఉదయం దక్షిణామూర్తి ప్రమోదను వెంట బెట్టుకుని మంజునాథ్ గారి జువెలరీ షాప్ లోకెళ్ళినట్టు

తెలిసింది నాకు. నేనక్కడ కెళ్ళేలోగా షాపు కట్టే శారు. దానికెదురుగావున్న జనరల్ స్టోర్‌లో కనుక్కుంటే ప్రమోద పోలికలుగల యువతి కారులో మంజునాథ్ భార్య వెంట వెళ్లిందని తెలిసింది. అందుకే యిక్కడికి వచ్చాను" అన్నాడు సంతోష్.

"మీ రిద్దరూ ప్రేమించుకున్న మాట నిజమే అయితే, యింకా పెళ్ళెందుకు జేసుకోలేదు? ఆ విధంగా ఆమెకు తోడూ, రక్షణా లభిస్తాయి కదా?" అడిగాడు దుర్యోధన్ అనుమానంగా.

"నేనంటే దక్షిణామూర్తికి మొదటినించీ కన్నెర్ర! ప్రమోద నన్ను పెళ్లి జేసుకుంటే ఆమె ఆస్తిమీద తన అధికారం లుప్తమౌతుందని భయం! నా మీద లేనిపోని అపోహలు సృష్టిస్తూ నానించి ఆమెను దూరం జెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ మధ్య నేను మా లాయర్ని సంప్రదించాను.

దక్షిణామూర్తి గనక ప్రమోద ఆభరణాలు అమ్మేస్తే, ఆ డబ్బంతా ఆమె పేర బ్యాంకులో సురక్షితం జెయ్యాలసిందిగా ప్రభుత్వాన్ని అభ్యర్థించి, ఆమె ఆ స్తిపాస్తులు సంరక్షించడానికి ఓ ట్రస్టీని నియమించాలని కోరతాను. చెప్పండి. ప్రమోద యెక్కడుంది? నేనామె నొక్కసారి చూడాలి" అన్నాడు సంతోష్ దీనంగా.

దుర్యోధన్ పనిమనిషి విమలని పిలిచి "ఇతన్ని పైకి తీసికెళ్లి ప్రమోదను చూపించు" అన్నాడు.

విమల వెంట మేడమీది కెళ్లాడు సంతోష్.

జయదీప్ సోఫాలోంచి లేచి, "ఇక నాకు సెల విస్తారా? ఒంట్లో చాలా నీరసంగా వుంది!" అన్నాడు.

దుర్యోధన్ తలూపి, "వెళ్లి రెస్టుతీసుకో. అవసరమైతే

కబురుచేస్తాను" అన్నాడు.

జయదీప్ వెళ్ళిపోగానే దుర్యోధన్ లేచి, అడుగులో అడుగు వేసుకుంటూ మేడమీదికెళ్ళి, తలుపు దగ్గరాగి, ప్రమోదవున్న గదిలోకి చూశాడు. ఆమె మంచంమీద కూర్చునుంది. సంతోష్ ఆమె చేతులు పట్టుకుని, యేదో మాట్లాడుతున్నాడు. అతని మాటలు అర్థమైనట్టు తలూపు తోంది ప్రమోద. ఇప్పుడామె కళ్ళల్లో మునుపటి భయమూ, ఆందోళనా లేవు. కొత్త వెలుగు కన్పిస్తోంది.

దీన్నిబట్టి సంతోష్ ఆమెకు పూర్వపరిచయస్తుడేనన్న నమ్మకం ఏర్పడింది డిటెక్టివ్‌కి.

"ప్రమోదా! యిప్పుడు నీకే ప్రమాదమూ లేదు. నా కంఠంలో ప్రాణం వుండగా నిన్నెవ్వరూ మోసం చెయ్యలేరు. నువ్విక్కడ సురక్షితంగా వున్నావ్. ఇక రెస్టు తీసుకో. నే మళ్ళీ వస్తాను" అంటూ ఆమె భుజంతట్టి బైటికి వచ్చాడు సంతోష్.

దుర్యోధన్ని చూడగానే, "ప్రమోదని వెంటబెట్టుకుని ఆ వజ్రాల దుకాణంలోకెళ్ళిన దక్షిణామూర్తి యేమయ్యాడు? ఆమెనిక్కడికెందుకు తీసుకొచ్చారు?" అడిగాడు.

"అతను మంజునాథ్‌కు అమ్మజూపిన ఆభరణాలు వాళ్ల స్వంతమేనని నిరూపించడానికి, తమ లాయర్ని పిల్చుకొస్తానని వెళ్లాడు. ఇంకా తిరిగి రాలేదు...." అంటూ జరిగిందంతా అతనికి వివరించి, "దక్షిణామూర్తి వాళ్ల ఫామిలీ లాయర్ యెవరో తెలుసా మీకు?" అడిగాడు దుర్యోధన్.

"తెలుసు. ఆయన పేరు నరోత్తమరావు. హబీబుల్లా రోడ్‌లో వుంటాడు. ఇప్పుడా ఆభరణాలెక్క

డున్నాయి?"

"షాపులో భద్రంగా వున్నాయి. ఇక్కడ దక్షిణా మూర్తికి బంధువులుగానీ, దగ్గరి స్నేహితులుగానీ ఎవ్వరైనా వున్నారా?"

"లేరనే అనుకుంటాను. అతను మద్రాసు వచ్చినప్పుడల్లా ప్లాజా హోటల్లో బసచేస్తాడు. బంధువులూ, స్నేహితులూ వుండివుంటే హోటల్లో దేనికి దిగాలి?"

"అతని క్యారెక్టర్ యెటువంటిది? దురలవాట్లేమైనా వున్నాయా?"

"ఒకటీ, రెండూ కాదు. అతనికి లేని దురలవాటు లేదనే చెప్పాలి. అంత వయసొచ్చినా అతనింకా పెళ్ళి చేసుకోలేదంటే మీరాశ్చర్యపోవచ్చు. కారణం సంసార లంపలాటం తన రంగేళీ జీవితానికి అవరోధం కదా? అందుకు!"

"ఐసీ, పాపం ఆ మూగపిల్ల అండ జూసుకుని...."

"ప్రమోద పుట్టుకతో మూగదీ, చెవిటిదీ కాదు! రెండేళ్ళక్రితం వరకూ ఆమె మనలాటి మామూలు మనిషే! అప్పుడామె తలిదండ్రులు కూడా బ్రతికే వున్నారు. ఒక రోజు రాత్రి ఆ ముగ్గురూ కారులో మద్రాసు వస్తుండగా మార్గంమధ్య కారు ఏక్సిడెంట్‌కు గురై ఆమె తలిదండ్రులిద్దరూ అక్కడికక్కడే మరణించారు.

ఆ షాక్‌తో ప్రమోద మాట పడిపోయింది. వినికిడి శక్తి కూడా హరించుకుపోయింది.... ఆ తరవాత దేశంలోని ప్రముఖ డాక్టర్లెందరో ప్రయత్నించి చూశారు. లాభం లేకపోయింది!"

సాలోచనగా తలూపాడు డిటెక్టివ్ దుర్యోధన్.

"ఇక నాకు సెలవిప్పిస్తారా? ఇప్పుడు ప్రమోద కేమీ

ప్రమాదం లేదని నాకు నమ్మకం యేర్పడింది. అవసరమైతే మళ్లీ కలుసుకుంటాను" అన్నాడు సంతోష్.

తలూపాడు దుర్యోధన్.

అతను వెళ్ళిపోగానే సద్గుణ పక్కగదిలోంచి బైటికి వచ్చి "ఆ కుర్రాడు ప్రమోదను నిజంగానే ప్రేమిస్తున్నాడంటారా?" అడిగింది.

"ఏమో చెప్పడం కష్టమే! రెండుకోట్ల ఆస్తికి ఏకైక వారసురాలైన ఒక అవిటి అమ్మాయిని ఎలాంటి వాడైనా కళ్ళుమూసుకుని గాఢంగా ప్రేమించెయ్యగలడు. ఈ రోజుల్లో నటులకేం కొదవలేదు. అందులో, ప్రేమ నటన యేమంత కష్టమైంది కూడా కాదు.... ఇక మేము వెళ్తాం! మీకేం భయంలేదు. బైట నలుగురు కానిస్టే బుళ్ళు కాపలా వుంటారు. మీ భర్త విషయంలోనూ ఆందోళన పడకండి. గుండు ప్రాణాపాయ ప్రదేశంలో తగల్లేదు" అంటూ ఆమెకు ధైర్యం చెప్పి కిందికి వచ్చాడు దుర్యోధన్.

సార్జంట్ డేవిడ్ కు నలుగురు కానిస్టేబుళ్ళని అక్కడే కాపలావుంచి వెళ్ళమని చెప్పి, అసిస్టెంట్ అర్జున్ తో బైటికి నడిచాడు.

"లాయర్ నరోత్తమరావు తెలుసా నీకు? టెలిఫోన్ డైరీలో అతని అడ్రస్ వుంటుంది. టాక్సీలో వెళ్ళి దక్షిణామూర్తి ఈ రోజతన్ని కలుసుకున్నాడో లేదో వాకబ్ చెయ్యి. అలాగే ప్లాజా హోటల్ కెళ్ళి ఆరా తియ్యి. నేను యింటి దగ్గరే వుంటాను" అంటూ గ్రాడ్విన్ కారెక్కి యింటికి బైలుదేరాడు దుర్యోధన్.

5

టెలిఫోన్ గణగణ మోగింది. రిసీవర్ అందుకుని, "హలో, డిటెక్టివ్ దుర్యోధన్ స్పీకింగ్!" అన్నాడు.

"నేనుసార్! జయదీప్ మాట్లాడుతున్నాను."

"ఏం జరిగింది? ఎక్కణ్నించి మాట్లాడుతున్నావ్?"

"మద్రాసుకు యెనభయిమైళ్ళ దూరంలోవున్న వడి వేలూర్ నించి మాట్లాడుతున్నాను."

"అక్కడికెలా వెళ్ళావ్? ఎందుకెళ్ళావ్?" అడిగేడు దుర్యోధన్ ఆశ్చర్యంగా.

"మద్రాస్ నుండి సంతోష్‌ని వెంబడిస్తూ వచ్చాను."

"ఎందుకు? మంజునాథ్ ఇంట్లోంచి అందరికన్నా ముందే నువ్వు వెళ్ళిపోయావుకదూ?"

"ఔను! నే చెప్పబోయే విషయాలు మిమ్మల్ని చాలా ఆశ్చర్యపరచవచ్చు. సంతోష్‌ని మొదటిసారి చూడగానే నా కతనిమీద యెందుకో అనుమానం కలిగింది. కారణం, కాంపౌండులో కాపలా కాస్తున్నప్పుడు నా వెనకనుంచి తలమీద కొట్టినవ్యక్తిని స్పృహతప్పి పడిపోతూ చూసేను. అతనూ, ఇతనూ ఒక్కరే అనిపించింది!"

"పొరబడుతున్నావేమో! మరొక్కసారి ఆలోచించుకుని చెప్పు!"

"ముందు నాకూ ఇలాగే సందేహం కలిగింది. ఎప్పుడయితే నేను ఆయింట్లోంచి బయటికివచ్చానో, పోర్టికోలో ఆగివున్న సంతోష్‌కారు కనిపించింది. అనుకోకుండా కారు లోపలికి తొంగిచూశాను. బాక్‌సీట్లో కనిపించిన వస్తువు నా సందేహాన్ని పటాపంచలు చేసింది. అదేమిటో తెలుసా? లావుపాటి ఇనపకడ్డీ! దాంతో నే నా తలమీద దెబ్బతీసి వుంటాడు."

"సంతోష్ ఇప్పుడెక్కడున్నాడు?"

"అతని కారు ఈ ఊళ్లో ప్రవేశించగానే తిన్నగా ఊరి చివరవున్న పెద్దభవనాన్ని సమీపించింది. చీకట్లో కారు ఆపి, కాంపౌండ్ గేటు తోసుకుని లోపలికెళ్లాడు. నేను అతన్ని టాక్సీలో వెంబడిస్తూ వచ్చానిక్కడకి.

చాలా సేపు అతనికోసం వైట్ చేస్తూ టాక్సీలో కూర్చున్నాను. ఎంతకీ తిరిగిరాకపోయే సరికి ఫోన్‌లో మీకీ విషయం తెలిజేద్దామని ఊళ్లోకొచ్చాను. ఇక్కడ శాంతి నివాస్ అనే లాడ్జింగ్ వుంది. అదృష్టవశాత్తూ అందులో టెలిఫోనుంది. మీరు మంజునాథ్ గారింటిలో వుంటారని అక్కడికి ఫోన్ చేస్తే, ఇంటి కెళ్ళిపోయారని చెప్పారావిడ...."

"నీలో డిటెక్టివ్‌ల కుండవలసిన లక్షణాలన్నీ పుష్కలంగా వున్నాయి. ఆల్ రైట్! నువ్వక్కడేవుండు. నేను వెంటనే బయలదేరి వస్తున్నాను" అంటూ రిసీవర్ దించి, ఫోన్‌పక్క నేవున్న నోట్‌పాడ్ మీద తాను వడివేలూర్ వెడుతున్నట్టు రాసి, ఇంటికి తాళంవేసి కారెక్కాడు డిటెక్టివ్ దుర్యోధన్.

వడివేలూర్ చేరడానికి రెండుగంటల పదిహేను నిమిషాలు పట్టింది.

ఊరికి దక్షిణదిశలో చిట్టచివరగా వుందా యిల్లు. దాన్ని ఇల్లనేకంటే పురాతన పద్ధతిలో కట్టిన రాజభవనం అనడం మేలు. భవనంచుట్టూ యెత్తయిన ప్రహారీగోడ. కాంపౌండ్‌లో ప్రవేశించడానికి విశాలమయిన ఇనప ఊచల గేటు. కాంపౌండ్‌లో ఏపుగా, గుబురుగా పెరిగిన చెట్లు. భవనం బయటగానీ, లోపలగానీ ఎక్కడా లైటు వెలగడము లేదు. చుట్టూ మసకచీకటి. కీచురాళ్ళ రొద.

ఇంటికి దూరంగా కీచీకట్లో కారాపి దిగాడు దుర్యోధన్. చుట్టూ కలయజూస్తూ గేటువైపు నడిచాడు. తెరుచుకుంటుందేమోనని కొద్దిగా తోసిచూశాడు. కీచుమంటూ తెరుచుకుంది. నెమ్మదిగా కాంపౌండ్‌లో అడుగు పెట్టాడు. చెట్లమధ్య నడుస్తూ కొద్దిదూరం వెళ్లాడో లేదో ఎదురుగా ఓ ఆకారం కదులుతున్నట్టు కనిపించి చటుక్కున ఆగిపోయాడు.

"జయదీప్!" పిల్చాడు స్వరం తగ్గించి.

"ఎస్ సార్!" అంటూ గబగబ అతన్ని సమీపించాడు జయదీప్.

దుర్యోధన్ ఏదో అడగాలని నోరు తెరిచాడు. అదే క్షణంలో వెనక ఎవ్వరో కదిలిన చప్పుడై చటుక్కున వెనుదిరిగాడు.

అంతే, గాలిని చీలుస్తూ యేదో పైకిలేవడం, రివ్వున కిందికి రావడం వంటి శబ్దం వినిపించింది. అతను వెనక్కు తిరగడంవల్ల తలమీద పడవలసిన ఆ పిడుగుదెబ్బ అతని భుజంమీద పడింది. క్షణంపాటు ఆ భుజం విరిగిపోయినట్టు తోచిందతనికి.

అదే క్షణంలో జయదీప్ మీదకూడా మరోవ్యక్తి దాడి చేశాడు. వాళ్ళిద్దరూ ఒకర్నొకరు వాటేసుకొని కింద పడిపోయారు. తనమీద దెబ్బతీసిన వ్యక్తి చెయ్యి మరోసారి పైకి లేవగానే బూటుకాలితో అతని తొడలమధ్య శక్తికొద్దీ తన్నేడు దుర్యోధన్. అటువంటి దెబ్బ తట్టుకోవడం సామాన్యుడికి సాధ్యంగాదు. గావుకేక పెడ్తూ ఇనపకడ్డీ కిందపడేసి రెండుచేతులతో అక్కడ అదుముకున్నాడతను.

ఆ అవకాశాన్ని వదులుకోకుండా అరిచేతి అంచుతో

వాడి మెడ వెనక 'కరాటే' దెబ్బతీశాడు దుర్యోధన్. కాండం నరికిన చెట్టులా కిందకూలి స్పృహతప్పాడతను. చటుక్కున జయదీప్ వైపు చూశాడు దుర్యోధన్. వాళ్ళిద్దరూ నేలమీద పొర్లుతూ ఒకర్నొకరు కుమ్ముకుంటున్నారు.

మెరుపులా అటు పరిగెత్తాడు దుర్యోధన్. అప్పటికే ఆలశ్యమైపోయింది. ప్రమాదాన్ని పసిగట్టిన ఆ హంతకుడు నేలమీంచి స్ప్రింగులా లేచి జయదీప్ డొక్కలోతన్ని కన్నుమూసి తెరిచేలోగా చీకట్లో అదృశ్యమయ్యాడు.

"జయదీప్! ఎలా వున్నావ్?" అడిగాడు దుర్యోధన్ ఆత్రుతగా.

జయదీప్ గట్టిగామూలిగి, "పక్క టెముకల్లో తన్నేడు రాస్కెల్! నేను మీలా ఫయిట్ చెయ్యలేను. అనుభవంలేదు" అంటూ నెమ్మదిగా లేచికూర్చున్నాడు.

"వీళ్ళిద్దరూ సంతోష్ మనుషులేనంటావా?"

"ఏమో చెప్పలేను!" అన్నాడు జయదీప్ అతని సాయంతో లేచి నిల్చుంటూ.

"ఇంత రాత్రివేళ సంతోష్ ఇక్కడికెందుకొచ్చాడు? ఈ ఇల్లెవరిది?"

"అదే నాకూ అర్థంగావడం లేదు. కారు యింటికి దూరంగా ఆపి, అతనియింట్లో ప్రవేశించాడంటే తప్పకుండా ఏదో నేరంచెయ్యడానికే వచ్చుంటాడనిపిస్తోంది."

"ముందా స్పృహతప్పిన వ్యక్తి ఎవ్వరో చూద్దాం రా" అన్నాడు దుర్యోధన్ నేలమీద బోర్లాపడున్న ఆగంతకుడివైపు నడుస్తూ.

జేబులోంచి సింగిల్ సెల్ టార్చితీసి, వెలిగించి, కాలో వాణ్ణి వెల్లకిలాతిప్పి మొహంమీద వెలుగువేశాడు, అంతకు

నుందా శాస్త్రీని యెక్కడో చూసినట్టే తోచిందతనికి. గబగబ వాడిజేబులు గాలించాడు. సిగరెట్ పాకెట్, మాచ్ బాక్స్, పాతపర్సు, డ్రయివింగ్ లైసెన్సు బైట పడ్డాయి.

లైసెన్సుమీద వాడిఫోటో, వివరాలు వున్నాయి.

సెంజపప్పన్,

తంబుచెట్టి స్ట్రీట్, డోర్ నెంబర్ 3-1-146.

అదే సమయంలో కిందపడున్న సెంజపప్పన్ కొద్దిగా కదిలి, చిన్నగా మూలుగుతూ కళ్ళుతెరిచాడు. టార్చి వెలుగులో దుర్యోధన్ని చూడగానే అదిరిపడి లేచి కూర్చున్నాడు. "మ్....మీరు డిటెక్టివ్ దుర్యోధన్ కదూ?" అడిగాడు వణికే కంఠంతో.

తలూపాడు డిటెక్టివ్.

"క్షమించండి! చీకట్లో మిమ్మల్ని గుర్తించలేక పోయాను. నేనిప్పుడు నేరవృత్తిలో జీవించడంలేదు. చాలారోజుల క్రితం కేవలం రెండుసార్లు శిక్ష అనుభవించాను.ఇప్పుడా వృత్తి మాని కష్టపడి సంపాదిస్తున్నాను."

"రాళ్ళకు బదులు తలకాలయలుకొట్టి సంపాదిస్తున్నావన్నమాట!"

"ప్రమాణంచేసి చెబుతున్నా సార్! నామాట నమ్మండి. మమ్మల్ని సంతోష్ అనేవ్యక్తి ఇక్కడకాపలా కాయడానికి తీసుకొచ్చాడు. తాను లోపలికెడుతున్నానని, ఎవ్వరయినా వస్తే లోనికి రానివ్వకుండా అడ్డుపడమని చెప్పివెళ్ళాడు."

"అతను లోపలికెందుకెళ్ళాడు?"

"మాకు తెలీదు."

"మీలాగే సంతోష్‌కూడా ఎవరికోసమైనా పనిచేస్తున్నాడా?"

"తెలీదు. కణ్ణదాసన్ అనేవ్యక్తి మమ్మల్ని పురమాయించాడు. సంతోష్ మమ్మల్నిక్కడకి తీసుకొచ్చాడు."

"కణ్ణదాసన్ ఎవరు? ఎక్కడుంటాడు?"

"మద్రాసులో! ట్రిప్లికేన్‌లో అతనికి వజ్రాల దుకాణముంది. అంతేగాదు, విలువయిన చరిత్రాత్మక వస్తువులు కూడా సేకరించి అమ్ముతుంటాడు."

"పారిపోయిన నీ రెండో సహచరుడెవ్వడు?"

"వాడిగురించి నాకేం తెలియదు సార్!"

"బొంకేవంటే నాలుక చీరేస్తాను. చెప్పు యెవడు వాడు?"

"దేవుడిమీద ఒట్టేసి చెబుతున్నా సార్! వాడి గురించి నాకేం తెలీదు. కణ్ణదాసనే వాణ్ని నా వెంట సంతోష్ దగ్గరకి పంపాడు."

"వాళ్లిద్దరిలో మీ యజమాని ఎవరు?"

"కణ్ణదాసనే సార్! అతనే మాకు డబ్బిస్తానన్నాడు. నేనిప్పుడు నేరవృత్తి మానేశాన్సార్!"

"మూర్ఖుడా! నా మీద యినపకడ్డీతో దాడిజెయ్యడం నేరం కాదా?"

"తప్పయింది సార్! క్షమించండి. మిమ్మల్ని సంతోష్ శత్రువనుకున్నాను. ఇకపై యిటువంటి పొరపాట్లు చెయ్యన్సార్. ఇక నన్ను వదిలిపెట్టండి. మీకు పుణ్యముంటుంది" అన్నాడు సెంజప్పన్ చేతులు జోడిస్తూ.

"ఆల్‌రైట్! నేను మద్రాసు వచ్చి నీ గురించి ఆరా తీయిస్తాను. నీవు చెప్పిందాంట్లో అక్షరం ముక్క పొల్లు

పోయినా, నీ చేతులకు అరక్షణంలో అరదండాలు బిగుసుకుంటాయి. వెళ్లిక్కణ్నించి" అన్నాడు దుర్యోధన్ కటువుగా.

"థాంక్స్ సార్!" అంటూ లేచి, గబగబ చీకట్లో అదృశ్యమయ్యాడు నెంజప్పన్.

6

"జయదీప్! నువ్వు బైటే వుండు. నేను లోపలకెళ్ళి యేం జరుగుతోందో చూస్తాను. సంతోష్ యే మార్గాన లోపల ప్రవేశించాడో చూద్దాం పద!" అంటూ టార్చికి అరచెయ్యి అడ్డంపెట్టి, కొద్దిపాటి వెలుగులో ముందుకు నడిచాడు దుర్యోధన్.

భవనం సింహద్వారం మూసివుంది. దాని కటూ ఇటూ అనేక కిటికీలున్నాయి. అందులో ఓ కిటికీ రెక్కలు తెరిచివున్నాయి. దాని చువ్వలు కోసి, పైకి మడిచి వున్నాయి.

"సంతోష్ ఈ మార్గానే లోపలికెళ్ళుంటాడు. ఇలాంటి వ్యవహారాల్లో నీకట్టే అనుభవం లేదు. అందుకే నువ్వు బైట వుండి, నే వెళ్లాక సంతోష్ బైటికి వస్తే నిలేసి నన్ను కేకెయ్యి!" అంటూ కిటికీ ఊచ అందుకుని, చేతుల మీద లేచి లోపలికి చూశాడు దుర్యోధన్.

లోపల మనిషి ఛాయలేదు. మసక చీకటి!

నెమ్మదిగా లోపలికి దూకేశాడు. అతని కాళ్ళకు రబ్బర్ బూట్సున్నా ఆ నిశ్శబ్ద నిశీధిలో ఏదో భారీ వస్తువు కిందపడ్డ శబ్దమయింది. ఊపిరి బిగబట్టి, చెవులు రిక్కించి అక్కడే కూర్చున్నాడు కాసేపు. ఎక్కడా ఏ అలికిడీ వినిపించక పోవడంతో నెమ్మదిగాలేచి ముందు

నడిచాడు. ఓ గదిలో గూర్ఖా శవం కనిపించింది. అతని గుండెలో ఈటె దించబడింది. శవాన్ని పరిశీలించాక ముందుకు నడిచాడు.

ఆ గది దాటాక హాలువచ్చింది. హాలుమధ్య చాలా తక్కువ ఓల్టేజ్ బల్బు వెలుగుతోంది గుడ్డిగా. లంకంత ఇల్లు అది. కిందా మీదా అనేక గదులున్నాయి. హాలు మధ్య పైకెళ్ళడానికి విశాలమయిన మెట్లున్నాయి. హాలు చుట్టూవున్న గదులముందు ఆగుతూ లోపల యేవయినా శబ్దాలు వినిపిస్తాయేమోనని చూశాడు.

ఏ అలికిడీ లేదు. సంతోష్ యేమయ్యాడు? ఇంత పెద్ద యింట్లో మనిషి ఛాయలేదేమిటి? ఆలోచిస్తూ పిల్లిలాగా మెట్లవైపు నడిచాడు.

మేడమీదున్న గదులన్నీ చూసుకుంటూ, చిట్టచివర వున్న గది ముందాగాడు. ఆ గదితలుపులు మూసివున్నాయి. పిస్తోలు రెడీగా పట్టుకుని మునివేళ్లతో తోసిచూశాడు. సవ్వడికాకుండా తెరుచుకున్నాయి. లోపల చీకటి!గదిలో యెవ్వరో వున్నట్టు గట్టిగా ఉఛ్వాస నిశ్వాసలు వినిపిస్తు న్నాయి. యెవరు? హంతకుడా?

ఛెంగున లోనికి గెంతి, గోడకి అతుక్కుపోయాడు. ఎటువంటి ప్రతిఘటన జరక్కపోయేసరికి యెడంచేతిలో వున్న టార్చిబటన్ వత్తాడు. ఆ కాంతిలో కనిపించిన దృశ్యం అతన్ని చకితుణ్ని జేసింది!

ఓ పక్క మంచం. ఆ మంచంమీద బోర్లాపడున్నాడో వ్యక్తి ఫుల్‌సూటులో. మంచాన్ని సమీపించాడు. కుంభ కర్ణుడిలా నిద్రపోతున్నాడతను. కుదిపి చూశాడు. అతనిలో చలనంలేదు. గట్టిగా భుజం తట్టాడు. ఐనా, అతను కళ్ళు

తెరవలేదు. అనుమానం వచ్చి కనురెప్పలు కొద్దిగా ఎత్తి చూశాడు.

బాగా మత్తు సేవించి వున్నట్టు పాలిపోయి వున్నాయి కళ్ళు! ఎవరతను? ఆలోచిస్తూ గబగబ అతని జేబులో వెదికాడు. కొన్ని కాగితాలూ, పర్సూ బైటపడ్డాయి. ఆ కాగితాల్లో ఓ విజిటింగ్ కార్డు కూడా వుంది. దానిమీద ముద్రించివున్న పేరూ, చిరునామా చూసి నిర్ఘాంత పోయాడు దుర్యోధన్.

దక్షిణామూర్తి
(లాండ్ లార్డ్)
వడివేలూర్.

ప్రమోద పినతండ్రి దక్షిణామూర్తి ఇతనేనా? ఇదేనా వాళ్ళ యిల్లు? లాయర్ని పిల్చుకొస్తానని వెళ్ళిన వ్యక్తి యిక్కడెలా వచ్చాడు? ప్రమోదనూ, వజ్రాలగుడ్డనూ మంజునాథ్ షాపులోనే వదిలి డబ్బుకూడా తీసుకో కుండా యెందుకొచ్చాడు? వచ్చినవాడు సూటుకూడా విప్పకుండా పడుకున్నాడేమిటి? తాగాడా?

ముహం మీదికి వంగి వాసన చూశాడు దుర్యోధన్. తాగినట్టు వాసనేదీ వెయ్యడంలేదు. మరి ఏమిటీ మైకం? ఆలోచిస్తూ వృధా కాలయాపన జేసేబదులు వెంటనే పోలీసుల్ని పిలిపించడం మంచిది. అనుకుంటూ టార్చి ఫోకస్ గోడలమీద వేశాడు.

తలుపుపక్కన కనిపించింది ఎలక్ట్రిక్ స్విచ్, వత్తి గదిలో లైటు వెలిగించాడు. మంచంపక్కన టీపాయ్ మీద కనిపించింది టెలిఫోన్. ముందు ఎక్స్ఛేంజికి ఫోన్ జేసి, లోకల్ పోలీస్ స్టేషన్ కు కనెక్ట్ జెయ్యమని కోరాడు.

ఫోన్ చేసిన పదినిమిషాల్లో జేరుకున్నాడక్కడికి పోలీసులు!

స్థానిక సబిన్‌స్పెక్టర్ దుర్యోధన్ని చూడగానే గుర్తుపట్టి, "మీరా! మద్రాసునించి యెప్పుడొచ్చారు?" అడిగాడు ఆశ్చర్యంగా.

దుర్యోధన్ అతనికి జరిగింది పూస గుచ్చినట్టు వివరించి "గూర్ఖా శవాన్ని, స్పృహలేని దక్షిణామూర్తినీ వెంటనే మద్రాసు తరలించాలి. గూర్ఖా హత్యకు ఉపయోగించిన ఆ ఈటెమీద హంతకుడి వేలిముద్రలుంటాయి. దాన్ని కూడా వెంట తీసికెళ్ళాలి. అంబులెన్స్ తెప్పించండి" అన్నాడు.

అంతలో అంబులెన్స్ వచ్చేసింది. దక్షిణామూర్తినీ, శవాన్నీ ఈటెనీ దాంట్లో జేర్చారు కానిస్టేబుళ్ళు.

అప్పటికే తూరుపుదిక్కున తెల తెలవారసాగింది. సార్జంట్, ఇద్దరు కానిస్టేబుళ్ళతో సహా అంబులెన్స్‌లో బయలుదేరాడు సబిన్‌స్పెక్టర్.

7

వాహనాలు మద్రాసు జేరగానే సరాసరి జనరల్ హాస్పిటల్ ముందు ఆపించి, దక్షిణామూర్తిని హాస్పిటల్లో జేర్పించాడు దుర్యోధన్.

డాక్టర్లు అతన్ని పరీక్షించి, పెథడిన్, మార్ఫిన్ వంటి మత్తు ఇంజక్షన్లే అతని మైకానికి కారణమనీ, ఆందోళన పడాల్సిన అవసరం లేదనీ చెప్పారు.

ఆ తరవాత క్రయింబ్రాంచి హెడ్‌క్వార్టర్స్‌కు ఫోన్ జేసి, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిని పిలిపించాడు దుర్యోధన్.

అతనికి జరిగిందంతా వివరించి, "గూర్ఖా శవాన్ని పోస్ట్ మార్టం జరిపించి, ఆ ఈటెమీద వేలిముద్రలు తీయించండి. సంతోష్ ఈ హత్యకు కారకుడని నా అనుమానం! నేనతని చిరునామా అడిగి తెలుసుకోనందుకు చింతిస్తున్నాను.

వడవేలూర్ నించి ఆతను రాత్రే వచ్చేసుంటాడు. మీ సిబ్బందిని రంగంలో దింపి అతనికోసం వెతికించండి. అన్నట్టు జోగేంధర్, మంజునాథ్ యెలా వున్నారు?" అడిగాడు.

"జోగేంధర్ని హాస్పిటల్ నించి డిశ్చార్జ్ జేశారు. మంజునాథ్ భుజానికి ఆపరేషన్ చేసి గుండు బయటికి తీసేశారు. అతనికి జ్వరం వచ్చింది. ఇంకా హాస్పిటల్లోనే వున్నాడు. జోగేంధర్ని లాకప్ లో వుంచాం. ఎంత తన్నినా నోరు విప్పడంలేదు వెధవ!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ట్రిప్లికేన్ లో నివసించే కణ్ణదాసన్ అనే వజ్రాల వ్యాపారి తెలుసా మీకు?"

"తెలీకేం? చాలా రోజుల్నించీ వాడు మా దృష్టిలో వున్నాడు. ఖరీదైన దొంగవస్తువులు సేకరించి అమ్మడంలో సిద్ధహస్తుడుట. వాణ్ని రంగుచేతులతో పట్టుకోవాలని యెన్ని పథకాలు వేసినా పారడంలేదు. చాలా తెలివిగా తన వ్యవహారాలు నడుపుకుంటున్నాడు. ఆల్ రైట్. మళ్లీవచ్చి కలుసుకుంటాను." అని, గూర్ఖా శవం వున్న అంబులెన్స్ యెక్కి వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టర్.

"పద, మంజునాథ్ ని చూద్దాం!" అంటూ జయదీప్ ను వెంటబెట్టుని ఆర్థో నెంబర్ నారువైపు నడిచాడు దుర్యోధన్.

వాళ్ళని చూడగానే మంజునాథ్ నవ్వాడు చిన్నగా. అతని మొహం పాలిపోయివుంది. జ్వరంవల్ల నీరసంగా కనిపిస్తున్నాడు. దుర్యోధన్ స్టూలుమీద కూర్చుని, అంతవరకూ జరిగిందంతా అతనికి పూసగుచ్చినట్టు వివరించాడు.

అంతా విన్న మంజునాథ్ మొహం మరీ పాలిపోయింది భయంతో. "ఆ వజ్రాలగుడ్లు దరిద్రంలా దాపురించాయి నా ప్రాణానికి. అవి నా దగ్గరకి వచ్చినప్పట్నించే యీ సంఘటనలు జరుగుతున్నాయి. నా మనసెందుకో కీడును శంకిస్తోంది. దేనికైనా మంచిది. ఒకసారి వాటిని చూసిరావాలి. నన్ను మీ వెంట షాపుకు తీసికెళ్ళండి" అన్నాడు ఆందోళనగా.

"ఈ సిటిలో, యింత జ్వరంతో షాపుకు వెళ్తారా? నో. నో!"

"నా మాట వినండి. వాటినొకసారి చూడందే నా మనసు శాంతించేలా లేదు. గంటక్రితమే నా భార్యా, శివానందం వచ్చి నన్ను పరామర్శించి వెళ్ళారు. ప్రమోదను యింట్లో ఒంటరిగా వదిలి యెందుకొచ్చావని నా భార్యని యింటికి పంపేశాను. షాపు తెరవమని శివానందానికి తాళం చెవులిచ్చి పంపాను.

ఒక్కోసారి నేను లేకున్నా అతను షాపు తెరిచి వ్యాపారం చూసుకుంటాడు. చాలా నమ్మకస్తుడు. అతన్నెందుకు పంపానా అని యిప్పుడు చింతిస్తున్నాను. ఆ ముసలాడిమీద దౌర్జన్యం జరిపి, ఆ వజ్రాలగుడ్లు ఎవరైనా యెగరేసుకుపోవచ్చు. అందుకే, ఒక్కసారి అక్కడికెళ్ళి చూడాలనుంది."

దుర్యోధన్ ఒక్కక్షణం ఆలోచించి, "ఆల్ రైట్!

నేవెళ్ళి చూస్తాను. మీరు నిశ్చింతగా వుండండి" అన్నాడు ధైర్యం చెబుతూ.

"థాంక్స్! అలాగే నా ఆఫీసులోని సీక్రెట్ సేఫ్ తెరిచి ఆ వజ్రాలగుడ్లు క్షేమంగా వున్నాయో, లేదో చూడండి. ఎనభైలక్షల సంపద పోతే నా పీకమీద కొస్తుంది. దివాలా తీస్తాను."

"ఓ.కే! నా మీద మీకంత నమ్మకమున్నందుకు థాంక్స్!" అన్నాడు దుర్యోధన్ నవ్వుతూ.

"ఎంతమాట! ప్రభుత్వానికీ, ప్రజలకూ, మీ మీద యెంత విశ్వాసం వుందో, మీకన్నా నాకే యెక్కువ తెలుసు. ఉండండి. ఆ సేఫ్ తెరుచుకునే నంబర్లు రాసిస్తాను. అలాగే, మీరక్కడికి వస్తున్నట్టు శివానందానికి ఉత్తరం రాసిస్తాను" అంటూ ఓ చీటీమీద నెంబర్లూ, వేరే కాగితంమీద వుత్తరం రాసిచ్చాడు మంజునాథ్.

దుర్యోధన్ ఆ నెంబర్లు చదివి చీటీ కాల్చిపారేశాడు. అతని దగ్గర సెలవు తీసుకుని జయదీప్ తో బయటికి వచ్చాడు. "జయదీప్! నువ్వు ట్రిప్లికేన్ వెళ్ళి కణ్ణదాసన్ షాపులో వున్నాడో, లేదో కనుక్కో. ఈ సంఘటనలన్నిటికీ అతనే మూలకారకుడని నా అనుమానం!"

"ఓ.కే. సార్! మిమ్మల్ని మళ్లీ యెక్కడ కలుసుకోమంటారు?"

"నా ఇంట్లో!"

జయదీప్ టాక్సీ యెక్కి వెళ్లిపోయాడు.

కారు స్టార్ట్ జేసి, పావుగంటలో మంజునాథ్ షాపు ముందు ఆపి దిగాడు దుర్యోధన్. షాపు తెరిచేవుంది. శివానందం నిక్షేపంగా తన కౌంటరులో కూర్చునున్నాడు.

డిటెక్టివ్ ని చూడగానే లేచి, "నమస్కారం సార్!

హాస్పిటల్ కెళ్ళి మంజునాథ్‌ను చూశారా?" అడిగాడు.

దుర్యోధన్ తలూపి, తను వచ్చిన పనిచెప్పి, మంజునాథ్ రాసిచ్చిన ఉత్తరం అందించాడతనికి. శివానందం ఉత్తరం చదివి, "వెళ్లండి. అదే వారి ఆఫీస్ రూం!" అంటూ చూపించాడు యెడంవైపు.

దుర్యోధన్ ఆఫీసులో అడుగుపెట్టి చుట్టూ కలయజూశాడు. కుడివైపు గోడలో బిగించివుంది సీక్రెట్ సేఫ్. మంజునాథ్ రాసిచ్చిన నంబర్లు తిప్పగానే, "క్లిక్"మంటూ తెరుచుకుంది లాక్!

తలుపు తెరవగానే "జిగేల్"మన్న వెలుక్కి అతని కళ్లు మూతలు పడిపోయాయి. నెమ్మదిగా కనురెప్పలు విప్పి చూశాడు. విస్మయంతో అతని కళ్ళు విప్పారాయి. అదివరకెన్నడూ చూడని చిత్రమైన గుడ్లు! వజ్రాలగుడ్లు!!

బంగారు గూడులోంచి ఓ గుడ్డు తీసి, వేళ్లమధ్య తిప్పుతూ పరీక్షించసాగాడు. ఆ పనితనం అతన్ని చకితుణ్ని చేస్తోంది. అంతలో వెనక అడుగులశబ్దం వినిపించి, "శివానందం! గుడ్లన్నీ క్షేమంగా వున్నాయి. మంజునాథ్ అనవసరంగా భయపడుతున్నాడు" అన్నాడు.

ఐనా, వెనకనించి జవాబు రాకపోయేసరికి, నెమ్మదిగా వెనుదిరిగి చూశాడు. దిగ్భ్రాంతితో దుర్యోధన్ నోరు తెరుచుకుంది. తలుపు దగ్గర ఓ ఆజానుబాహుడు నిల్చున్నాడు. వాడిచేతిలో సూటిగా తనవైపు గురిపెట్టివున్న పిస్తోలు!

దుర్యోధన్ కనుబొమలు ముడివడ్డాయి. "ఎవరు నువ్వు? లోపలికెలా వచ్చావ్?"

"కాళ్ళు కనిపించడంలా? నడిచి వచ్చాను."

బయట శివానందం వుండగా వీడింత నిశ్శబ్దంగా యెలా

రాగలిగాడు లోపలికి? శివానందం కూర్చునే కౌంటర్ బల్లకు తప్పకుండా ప్రమాదాన్ని సూచించే అలారం బటన్ బిగించివుంటుంది. అటువంటి వ్యక్తి లోనికి వచ్చినా, అతను బటన్ వత్తి తనని దేనికి హెచ్చరించ లేదు?

"ఎత్తులు వెయ్యడానికి అనవసరంగా ఆలోచించక! బుద్ధిగా చేతులు పైకెత్తి ఆ గోడవైపు తిరిగి నిల్చో!" ఆజ్ఞాపించాడతను.

"నీ ఉద్దేశం ఏమిటి?"

"ఉద్దేసం వేరే చెప్పడం దేనికి? ఆ వజ్రాలగుడ్ల కోసమే వచ్చానని తెలీడంలేదూ?"

"అవి నీ స్వంతఆస్తి అయినట్లే మాట్లాడుతున్నావే!"

"ఈ క్షణం నించీ ఈ షాపులోవున్న ప్రతి వస్తువూ నా స్వంతమే! ఊఁ, చెప్పినట్టు జెయ్" అరిచాడతను.

తాత్సారం జెయ్యకూడదు. ఇంత ఖరీదైన సంపద ఎదురుగ వుండగా, ఒక మనిషి ప్రాణాలు తీయ్యడం వీడికి త్రుటిలో పని. నెమ్మదిగా చేతులు పైకెత్తాడు సుయోధన్. ఆ వజ్రాల గుడ్డింకా అతని చేతిలోనే వుంది. దాన్ని వేళ్ల మధ్య యిరికించి తిప్పుతూ, మెరుపులా అతని మొహం మీదికి విసిరాడు. అంతే!

రెండు సంఘటనలు ఒకేసారి జరిగాయి. ఆ వస్తువేమిటో తెలీక అతను తన కళ్లని కాపాడుకోడానికి యెడంచేత్తో మొహం దాచుకున్నాడు. మరుక్షణం అతని కుడిచెయ్యి అప్రయత్నంగా పిస్తోలు ట్రిగ్గర్ని వత్తేసింది. అలా జరుగుతుందని ముందే ఊహించిన సుయోధన్ త్రుటిలో పక్కకి తప్పుకున్నాడు. గుండు అతనికి వెంట్రుక వాసిలో మూసుకెళ్లి ఇనప్పెట్టెకి తగిలింది.

ఆ లిప్తపాటి వ్యవధిని వృథా పోనివ్వలేదు దుర్యోధన్. కాళ్ల కింద స్ప్రింగులు వున్నట్టు రివ్వున గాలిలోకి యెగిరి అతని కుడిచేతిమీద తన్నేడు. పిస్తోలు యెగిరి అవతల పడింది. క్షణం జాగుచెయ్యకుండా బూటుతో యీడ్చి అతని తొడలమధ్య తన్నేడు. గావుకేక పెడుతూ చేతులతో అక్కడ అదుముకున్నాడతను. ఇనప కడ్డీలాంటి వేళ్లని అతని కళ్లలో పొడిచాడు దుర్యోధన్.

“అబ్బా!” అన్న ఆర్తనాదం. కళ్ళు మూసుకున్నాడతను.

అరచేతి అంచుని కటిక వాడికత్తిలా పైకిలేపి, అతని మెడమీద చివరిదెబ్బ తీశాడు దుర్యోధన్. అంతే! కాండం నరికిన చెట్టులా కింద కూలాడతను.

చకచక కిందపడ్డ పిస్తోలూ, వజ్రాలగుడ్డా యినప్పెట్టెలో పెట్టేసి యథాప్రకారం దానికి లాక్ వేశాడు దుర్యోధన్.

లోపలింత గొడవ జరుగుతున్నా, బయట శివానందం యేం చేస్తున్నట్టు? అనుకుంటూ గబగబ బయటికెళ్లి కౌంటర్ వైపు చూశాడు. అక్కడ కనిపించిన దృశ్యం అతన్ని రాతిబొమ్మను చేసివేసింది.

శివానందం కౌంటర్ మీద తలఆనించి కూర్చునున్నాడు. అతని తలవెనక భారీవస్తువుతో కొట్టినట్టు పగిలివుంది. రక్తం వరదలా కారి వీపంతా తడిసివుంది. దగ్గరకెళ్లి పరీక్షగా చూశాడు. శివానందంలో చలనంలేదు. మరణించాడు! అప్పుడు పడింది డిటెక్టివ్ దృష్టి, కౌంటర్ బల్లకు బిగించివున్న పుష్‌బటన్ మీద.

వత్తిచూశాడు దాన్ని. బర్‌గ్లర్ అలారమ్ బిగ్గరగా మోగింది షాపులో! శివపాదం తల—వెనకవైపు పగిలి

వుంది. అంటే, హంతకుడు నింపాదిగా కౌంటరులో ప్రవేశించి, అతని వెనక నిల్చుని, తలమీద కొట్టాడన్న మాట. అలారమ్ బటన్ చేతికింత చేరువలోవుండగా హంతకుడు కౌంటరులో ప్రవేశించి తనవెనక్కి వచ్చినా శివానందం దాన్ని ఎందుకు వత్తలేదు? తాను లోపలున్నా నని తెలిసికూడా దేనికి అరవలేదు?

అంటే, హంతకుడతనికి బాగా పరిచయస్తుడైవుండాలి. అందుకే అతను కౌంటరులో ప్రవేశిస్తున్నా, తనమీద దాడిచేస్తాడని ఏమాత్రం ఊహించలేక ఆ బటన్ వత్తకుండా ఊరుకున్నాడు శివానందం! లోపల తనచేత మూర్ఛపోయిన వ్యక్తిగాక, వాడివెంట యింకెవరయినా వచ్చారా ఇక్కడకి? ఎవరు?

తీవ్రంగా యోచిస్తూ, కౌంటర్ బల్లమీదున్న టెలిఫోన్ దగ్గరకి లాక్కుని గబగబ క్రయింబ్రాంచికి రింగ్ చేశాడు దుర్యోధన్. ఇన్స్పెక్టర్ రాజారెడ్డి లైన్లోకి రాగానే అతనికి జరిగింది వివరించి తక్షణం సిబ్బందితో బయలదేరి రమ్మని చెప్పాడు.

పదినిమిషాల్లో బాణాల్లా దూసుకువచ్చి షాపుముందు ఆగాయి పోలీస్ వాహనాలు. హడావుడిగా లోపలికి వచ్చాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి. అంతలో స్పృహతప్పిన వ్యక్తికి తెలివి వచ్చేసింది. అతని చేతులు వెనక్కి విరిచి బేడీలు బిగించారు. పదిహేను నిమిషాలు ప్రయత్నించినా వాడు తన పేరుగానీ, ఇతర వివరాలుగానీ చెప్పడానికి ససేమిరా ఒప్పుకోలేదు.

"ఇలాటివాళ్ళు మర్యాదగా నోరు విప్పరు. హెడ్క్వార్టర్స్కు తీసికెళ్ళి మీ పద్ధతులుపయోగించండి" దుర్యోధన్ అన్నాడు.

అక్కడ్నుంచి తిన్నగా తన యింటికి చేరుకున్నాడు దుర్యోధన్.

అప్పటికే జయదీప్ అక్కడికివచ్చి, అతని అసిస్టెంట్ అర్జున్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడు లోపల.

దుర్యోధన్ని చూడగానే అర్జున్ విష్‌చేసి, "జయదీప్ అంతా చెప్పాడు. చేతిలో పనిలేక ముళ్ళమీద కూర్చున్నట్టుంది నాకు. ఏదయినా పనుంటే చెప్పండి" అన్నాడు.

"అందుకే వచ్చానిక్కడికి." అంటూ జయదీప్ వైపు తిరిగి, "నువ్వెళ్ళిన పనేమైంది?" అడిగాడు దుర్యోధన్.

"కణ్ణదాసన్ షాపులోలేడు. వాకబ్ చేశాను. ఊళ్లోనే వున్నాడుట. ఉదయమే ఎక్కడికో వెళ్ళాడుట" జయదీప్ చెప్పాడు.

"ఆల్ రైట్! అతనిసంగతి నేను చూసుకుంటాను. నువ్వెళ్ళి రెస్టుతీసుకో. అవసరమైతే పిలిపిస్తాను"అన్నాడు దుర్యోధన్.

జయదీప్ లేచి, వాళ్ళదగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఈరాత్రి నేను దొంగచాటుగా కణ్ణదాసన్ ఇంట్లో ప్రవేశించాలనుకుంటున్నాను. ఆ ఇంట్లో ఏదో రహస్యం దాగివుందని నా అనుమానం! ఇక నువ్వు చెయ్యవలసిన పనేమిటో చెబుతాను" అంటూ ముందుకువంగి, అసిస్టెంటుకు ఆదేశాలిచ్చాడు దుర్యోధన్.

అంతా విన్న అర్జున్ తలూపి, లేచి గబగబ బయటికి నడిచాడు.

8

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో నల్లదుస్తులూ, కాన్వాస్ బూట్లూ తొడుక్కొని కావలసిన వస్తువులు జేబుల్లో వేసుకొని బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. ఇంటికి తాళం వేసి, గ్రాబ్డిన్ కారెక్కి కదిలాడు ట్రిప్లికేన్ వైపు.

పావుగంటలో చేరుకున్నాడక్కడికి.

కణ్ణదాసన్ ఇంటికాస్త దూరాన, చిరుచీకట్లో కారాపి దిగాడు. అది సెకండ్ షో వదిలిన సమయం. వీధిలో కుక్క దిక్కు లేదు. నల్లదుస్తులు తొడుక్కోవడం వల్ల అతని ఆకారం చీకట్లో పూర్తిగా కలిసిపోతోంది. అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటిని సమీపించాడు.

షాపు వెనకే వుంది కణ్ణదాసన్ మేడ. తలెత్తి మేడ మీదకి చూశాడు. బాల్కనీలోంచి ఓ గదిలో వెలుగుతున్న జీరోవాల్టు కాంతి కనిపిస్తోంది మసగ్గా. బహుశా, అది పడగ్గదయి వుంటుంది. బాల్కనీ పక్కనే వుంది నీటి గొట్టం! దాన్ని సమీపించి, ముందు మట్టితో అరచేతులు రుద్దుకొని, అందుకొన్నాడు గొట్టాన్ని.

జాగ్రత్తగా సరసర ఎక్కసాగాడు పైకి. సగం దూరం వెళ్ళాడో లేదో, "ఢాం! ఢాం!!" అన్న చప్పుళ్లు వినిపించి ఉలిక్కిపడ్డాడు. పైన మేడమీది గదిలోంచి వినిపించాయా చప్పుళ్ళు. మరుక్షణం చావుకేక!

కన్నుమూసి తెరిచేలోగా బాల్కనీ అంచు అందుకొని ఎగిరి లోపలికి దూకాడు దుర్యోధన్.

అక్కణ్ణించి గదిలోకెళ్లే తలుపు మూసుంది. తెరిచి వున్న కిటికీలోంచి చూశాడు లోపలికి. ఆశ్చర్యంతో దుర్యోధన్ కళ్ళు విప్పారాయి.

గది మధ్యలో సంతోష్ నిల్చునున్నాడు! అతని చేతిలో పిస్తోలు!! ఓ గోడవారగా మంచం! ఆ మంచం మీద రక్తపుమడుగులో కణ్ణదాసన్!!

అంతలో బయటనుంచి ఓ లావుపాటి స్త్రీ పరుగెత్తుకొచ్చిందా గదిలోకి. "ఏం జరిగింది? ఏమిటాచప్పుళ్ళు? ఎవరు కేకలేశారు?" అంది ఒగరుస్తూ. బహుశా, ఆమె కణ్ణదాసన్ భార్య అయుంటుంది.

మంచంమీద నిర్జీవంగా పడున్న భర్తనీ, చేతిలో పిస్తోలుతో దిక్కులుచూస్తూ నిలుచున్న సంతోష్‌నీ చూడగానే గుండెలు బాదుకుంటూ, "నీచుడా! కన్నకొడుకులా పెంచి పెద్దవాణ్ణి చేసిన ఆయన్ని చంపేశావా?" అంటూ పెడబొబ్బలు పెట్టసాగింది.

ఆ కేకలకు ఇద్దరు నౌఖర్లు పరిగెత్తుకొచ్చారక్కడికి. "వీణ్ణి పట్టుకోండి, కట్టేయండి. నేను పోలీసులకి ఫోన్ చేస్తాను" అంటూ ఫోన్ దగ్గరికి పరిగెత్తిందా స్త్రీ.

అంతే. నౌఖర్లు దగ్గరికి రాకముందే ఢేంగున తలుపువైపు గెంతి పరుగు లంకించాడు సంతోష్.

"పారిపోతున్నాడు. తరమండి, పట్టుకోండి" అరిచిందా స్త్రీ.

నౌఖర్లుకూడా అతని వెనకే బయటకి పరుగుతీశాడు.

సంతోష్ ఈ ఇంట్లోనే తలదాచుకుంటాడని అనుమానించాడు తను. ఆ అనుమానం తీర్చుకోడానికే యిలా వచ్చాడు. పోలీస్ బలగంతో హఠాత్తుగా రైడ్ చేస్తే దొంగదారిన అతను పారిపోవచ్చనే ఈ విధంగా రావలసి వచ్చింది. ఐతే యిటువంటి దృశ్యం కంటబడుతుందని ఎంతమాత్రం ఊహించలేదు.

నీటిగొట్టం అందుకుని గబగబ కిందికి చేరుకున్నాడు

దుర్యోధన్. ఇది చాలా పెద్దయిల్లు. ఎన్ని తలుపులు వున్నాయో, ఎన్ని కిటికీలున్నాయో, అవి ఎక్కడెక్కడున్నాయో తనకి తెలీదు. సంతోష్ యే దారిన పారిపోతాడో అంచనా వెయ్యడం కష్టం!

వెంటనే క్రయింబ్రాంచ్ హెడ్‌క్వార్టర్స్ కెళ్లి, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిని కలుసుకోవాలి అనుకుంటూ కారుదగ్గరికి పరిగెత్తి, పది నిమిషాల్లో చేరుకున్నాడు హెడ్‌క్వార్టర్స్‌కు. ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి అప్పుడే తన బలగంతో జీప్ యెక్కుతున్నవాడల్లా దుర్యోధన్ కారు చూడగానే ఆగిపోయాడు.

"కణ్ణదాసన్ ఇంటినించి యిప్పుడే ఫోన్ వచ్చింది. సంతోష్ అతన్ని పిస్తోలుతో చంపి పారిపోయాడుట" అన్నాడు కారు దగ్గరికి వస్తూ.

దుర్యోధన్ జరిగిందంతా అతనికి పూసగుచ్చినట్టు వివరించి, "సంతోష్ కణ్ణదాసన్ పెంపుడు కొడుకని ఇప్పుడే తెలిసింది నాకు. ఐతే, పెంపుడు తండ్రిని యిలా దేనికి చంపాడో ఊహించలేకపోతున్నాను" అన్నాడు.

"అన్నట్టు మీరు హాస్పిటల్లో అడ్మిట్ జేసిన దక్షిణామూర్తి తెలివిరాగానే ఎవ్వరి మాట వినిపించుకోకుండా, టాక్సీలో మంజునాథ్ యింటికెళ్లి ప్రమోదను వెంటబెట్టుకుని వడివేలూర్ వెళ్ళిపోయాడట" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎప్పుడు వెళ్ళాడు? ఎందుకు వెళ్ళనిచ్చారు?" అన్నాడు దుర్యోధన్ ఆశ్చర్యంగా.

"నాకు తెలిస్తేగా? సాయంత్రం మంజునాథ్ భార్య ఫోన్ జేసి చెప్పింది నాకు. ప్రమోద కూడా పినతండ్రి వెంట వెళ్లడానికి అభ్యంతరపెట్టలేదుట. అందుకే ఆమె

కూడా వాళ్ళని వారించలేక పోయిందట."

చటుక్కున రిస్టువాచీ చూసుకున్నాడు దుర్యోధన్. రాత్రి మూడుగంటలు!

"మనం వెంటనే వడివేలూర్ వెళ్ళాలి. నా అసిస్టెంట్ అర్జున్ వేరే పనిమీదున్నాడు. కణ్ణగాసన్ శవాన్ని మార్చ్యురీకి పంపే పని మీ సార్జంట్ డేవిడ్ కప్పగించి, మీరు నా వెంట రండి. నా అంచనా సరైనదైతే హంతకుడు అక్కడే పట్టుబడతాడు."

ఇన్స్పెక్టర్ తలూపి, సార్జంట్ కు ఆదేశాలు జారీచేసి, దుర్యోధన్ వెంట కారెక్కాడు.

కారు వడివేలూర్ చేరడానికి తెల్లవారు జాము ఐదు గంటలయింది. దక్షిణామూర్తి ఇంటిదగ్గర కారాపి దిగారిద్దరూ. ఆ ఇల్లు ఇంకా నిశ్శబ్దంలో నిదరబోతోంది. గేటు తెరిచి కాంపౌండ్లో ప్రవేశించారు.

9

అప్పుడే తూరుపుదిక్కున తెలతెలవారసాగింది.

కాలింగ్ బెల్ వత్తిన యెంతోసేపటిగ్గాని తలుపు తెరుచుకోలేదు.

దక్షిణామూర్తి వాళ్ళను చూడగానే, "మీరా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"హాస్పిటల్ నించి యెవరికీ చెప్పకుండా ప్రమోదను తీసుకుని యెందుకు వచ్చేశారు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

కోపంతో అతని మొహం ఎర్రబడింది. "అది నా స్వంతవిషయం! మీ అనుమతి తీసుకోడానికీ, ఆజ్ఞలు పాటించడానికీ నేను మీ బానిసను కాను. ఖైదీని అంతకన్నా కాను" అన్నాడు ఆవేశంగా.

"దక్షిణామూర్తి గారూ! మీరు అనవసరంగా ఆవేశ పడుతున్నారు. ముందు లోపలికి పదండి. మీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలి" అన్నాడు దుర్యోధన్ శాంతంగా.

"నేనిప్పుడు మీతో మాట్లాడే మూడ్‌లో లేను. దయ చేసి నన్నిలా ఒంటరిగా వదిలి వెళ్లండి" అన్నాడు దక్షిణా మూర్తి మొహం చిట్లిస్తూ.

ఇన్‌స్పెక్టర్ ఉరిమి చూశాడతన్ని, "మిస్టర్ దక్షిణా మూర్తీ! ఇది మూడు హత్యలకు సంబంధించిన విషయం! కొద్దిగంటల క్రితమే మద్రాసులో కణ్ణదాసన్ హత్య జెయ్యబడ్డాడు. ఈ సంఘటనలతో మీకూ సంబంధం వుంది గనక, మిమ్మల్ని ప్రశ్నించే అధికారం మాకుంది. మర్యాదగా మాతో సహకరించకపోతే, నా అధికారాన్ని వినియోగించవలసి వస్తుంది జాగ్రత్త!" అన్నాడు కోపంగా.

"కణ్ణదాసన్ హత్యజెయ్యబడ్డాడా? ఎప్పుడు? ఎవరు చంపారతన్ని?" అడిగాడు దక్షిణామూర్తి నివ్వెరబోతూ.

"సంతోష్ చంపాడు!"

"అరెస్ట్ చేశారా వాణ్ని?"

"లేదు, పారిపోయాడు!"

"నాకు మొదటినించీ వాడిమీద సదభిప్రాయంలేదు. అమ్మాయి ప్రమోదను ప్రేమిస్తున్నట్టు నటిస్తూ, ఆమెను పెళ్ళిచేసుకుని, ఆ సంతా కాజేయాలని వాడి ప్రయత్నం! అదంతా ఆ తండ్రీ కొడుకుల పన్నాగం! కణ్ణదాసన్ వాడి పెంపుడు తండ్రి!

నేను వాళ్ల ఆటలేవీ సాగనివ్వడంలేదని నా మీద కక్షగట్టారు. ప్రమోదకింకా మైనారిటీ తీరలేదు. అందుకే

నేను వాళ్ళదారి కడ్డున్నా, నన్ను చంపకుండా తాత్సారం జేస్తున్నారు. కారణం, ఇప్పుడీ ఆ సంతా నా ఆధీనంలో వుంది. నన్ను చంపినా, మైనారిటీ తీరని ప్రమోదకా ఆ స్తిరాస్తి. చట్టరీత్యా ఆమెను పెళ్ళి జేసుకోనూ లేదు!

అందుకే ఆమెకు మైనారిటీ తీరేవరకూ నన్ను ప్రాణా లతో వుంచదలచారేమో, ఇంతవరకూ యే హానీ తలపెట్ట లేదు."

"సంతోష్‌ను పెంపుడుతండ్రిని చంపేంతటి కారణా లేవీ కనిపించడంలేదే? మరి అతన్ని దేనికి చంపా డంటారు?" అడిగాడు దుర్యోధన్.

"అదే నాకూ అర్థంకావడంలేదు. ఏవో కారణాలు వుండనే వుంటాయి."

"సరే, ఇప్పుడు చెప్పండి. మంజునాథ్ షాపునించి లాయర్ని పిల్చుకొస్తానని వెళ్ళిన మీరు యిక్కడికెలా వచ్చారు? స్పృహలేనిస్థితిలో యెందుకు పడున్నారు?" అడి గాడు దుర్యోధన్.

దక్షిణామూర్తి వెంటనే పలకలేదు. కాసేపు ఆలో చించి, "రండి. లోపలికి రండి. ఇక నేనెవ్వరికీ భయపడే అవసరంలేదు. అంతా చెప్పేస్తాను" అంటూ తలుపుకడ్డం తొలిగేడు.

దుర్యోధన్, ఇన్స్పెక్టర్ ఇద్దరూ లోన అడుగు పెట్టారు. మేడ మెట్లమధ్య భయాందోళనలతో వాళ్ళనే చూస్తూ నిల్చునుంది ప్రమోద.

దక్షిణామూర్తి వాళ్ళను వెంబడెట్టుకుని తన గదిలోకి తీసికెళ్ళాడు.

"కూర్చోండి" అంటూ వాళ్ళకు సోఫాలు చూపి

తను మంచంమీద కూర్చున్నాడు. ప్రమోద ఓ పక్కగా నిల్చుని వాళ్లను చూడసాగింది.

"ఆ రోజు మంజునాథ్ షాపునించి బయటికి రాగానే టాక్సీయెక్కి లాయర్ కోసం బయలుదేరాను. కొద్దిదూరం వెళ్ళాక యెవ్వరో నా టాక్సీని వెంబడిస్తునట్టు అనుమానం వేసింది....లాయర్ వుండే వీధి మొదట్లో నేను టాక్సీ దిగి, సందులోపడి వెళుతుండగా నా అనుమానం నిజమేనని తేలింది.

వెనకనించి నలుగురు రౌడీలు పరిగెత్తుకొచ్చి, నన్ను కొడుతూ బలవంతంగా ఓ అంబాసిడర్ కారు దగ్గరికి యీడ్చుకెళ్ళారు. అంతక్రితం నా టాక్సీని వెంబడించింది ఆ కారే!

బాక్ సీట్లో కణ్ణదాసన్ కూర్చునున్నాడు. ఏ వజ్రాల గుడ్లను సంపాదించడానికి ఇన్నాళ్ళూ అతను నన్ను బ్లాక్ మెయిల్ జేస్తున్నాడో, ఆ వజ్రాలగుడ్లతో నేనా రోజు మంజునాథ్ షాపుకెళ్ళడం తెలిసిపోయిందట అతనికి.

మా తాత ముత్తాతల కాలంలో, ఈ చుట్టుపక్కల మాకో సంస్థానం వుండేది. ఆ రోజుల్లోనే మా తాతగారు యెవరి దగ్గరో ఆ వజ్రాలగుడ్లు కొన్నారట. అది మా వంశ అమూల్య సంపదగా యెంతో జాగ్రత్తగా ఇన్నాళ్ళూ కాపాడుతూ వస్తున్నాం!

వాటి సంగతి మా అన్నగారు, అంటే ప్రమోద తండ్రిద్వారా కణ్ణదాసన్‌కు తెలిసింది. వాళ్ళిద్దరూ అప్పుడు మంచి స్నేహితులు. కణ్ణదాసన్‌ది ఈ ఊరే....

మా అన్నగారి మరణానంతరం, తన చేతిలో కీలుబొమ్మనైవున్న నన్ను బెదిరించడం ప్రారంభించాడు కణ్ణ

దాసన్. ఆ వజ్రాలగుడ్డ యివ్వననీ, లేదా రహస్యం బయట పెట్టేస్తాననీ! అన్నగారు వాటినెక్కడ దాచి పెట్టాడో నాకు తెలీదనీ, వాటికోసమే గాలిస్తున్నాననీ, దొరగ్గానే యిచ్చేస్తానని యిన్నాళ్ళూ బొంకుతూ వస్తున్నాను.

ఇక వాటిని ఇంట్లో వుంచడం ప్రమాదమని గ్రహించి మంజునాథ్ క మ్మేద్దామని అన్ని షాపుకెళ్ళాను. ఆ సంగతి కణ్ణదాసన్ కెలా తెలిసిందో తెలిసిపోయింది....

నేను లాయర్ ఇంటికెళ్ళకముందే తన మనుషులతో నన్ను కారులోకి తెప్పించి, ఇన్నాళ్ళూ తనని మోసం జేసినందుకు నన్ను నానా బూతులూ తిట్టి, ఆ వజ్రాలగుడ్డ సంగతి మర్చిపొమ్మనీ, మంజునాథ్ దగ్గర్నుంచి వాటినెలాగో తాను సంపాదించుకుంటాననీ, పిచ్చివేషాలు వెయ్యకుండా బుద్ధిగా యింటికెళ్ళమనీ, మళ్ళీ మంజునాథ్ షాపులో అడుగు పెట్టవద్దనీ హెచ్చరించాడు.

నా పీక వాడి చేతిలో వుంది గనక, చచ్చినట్లు తలూపాను. అదే కారులో వాడి మనుషులు నన్ను యిక్కడికి తీసుకొచ్చి, ఏదో ఇంజక్షన్ యిచ్చి, పక్కమీద పడేసి వెళ్ళిపోయారు .... ఆ తరవాత కళ్ళు తెరిచి చూస్తే హాస్పిటల్లో వున్నాను!”

కణ్ణదాసనంటే మీ రెందుకంత భయపడేవారు? అతనలా మీమీద దౌర్జన్యం జేస్తుంటే పోలీసుల సహాయం కోరకుండా ఎందుకూరుకున్నారు?” అడిగాడు దుర్యోధన్ ఆశ్చర్యంగా.

“రెండేళ్ళక్రితం మేమిద్దరం కలిసి ఓ నేరం చేశాము. స్వయంగా జెయ్యకున్నా, ఓ కిరాయిహంతకుడిచేత

చేయించాము. కణ్ణదాసన్ చచ్చాడు గనక యిప్పుడా నేరాన్ని బయట పెట్టినా, మీరు దాన్ని రుజువు చెయ్యలేరు. అందుకే యింత నిబ్బరంగా ఆ సంఘటనలన్నీ చెప్పడానికి సిద్ధమయ్యాను. ఇక వినండి....” అంటూ ప్రారంభించడానికి కంఠం సర్దుకున్నాడు దక్షిణామూర్తి.

సరిగ్గా అదే క్షణంలో తలుపుదగ్గరేదో చప్పుడై వులిక్కిపడి అటు చూశాడు ఇన్‌స్పెక్టర్. అంతే. “ఢాం! ఢాం!!” రెండుసార్లు పేలింది పిస్తోలు.

మరుక్షణం గుమ్మంలో నిల్చున్న ముసుగుమనిషి మెరుమెలా తలుపుమూసి అవతల గడియపెట్టేశాడు. గుళ్ళు రెండూ దక్షిణామూర్తి గుండెలో దిగాయి. అతని నోట్లోంచి అరుపు కూడా ఇవతలికి రాలేదు. గుండె పట్టుకుని తోసినట్టు మంచంమీంచి కింద పడిపోయాడు. అంతే!

ఊహించని విధంగా ప్రమోద కేకపెడుతూ అతన్ని సమీపించి, “చిన్నాన్నా! చిన్నాన్నా ఏమైంది? ఏమిటిదంతా?” అంటూ ఏడవసాగింది.

ఆశ్చర్యంతో ఒకరి మొహాలొకరు చూసుకున్నారిద్దరూ. తరవాత ఒక్క ఉదుటున లేచి, తలుపు దగ్గరికి పరిగెత్తి లాగి చూశారు దాన్ని. తెరుచుకోలేదు. అదే సమయంలో బయట నడవాలో రెండుసార్లు పిస్తోలు పేలిన శబ్దాలు వినిపించాయి. మరుక్షణం గావుకేక గింగురుమంది ఇల్లంతా. ఎవ్వరో దబ్బున కిందపడ్డ చప్పుడు!

“ఇంట్లో యెవ్వరూ లేరే? ఆ ముసుగుమనిషి ఎవ్వర్ని కాల్చివుంటాడు ....”ఇన్‌స్పెక్టర్ మాట పూర్తికాక ముందే అవతల తలుపు గడియ తీస్తున్న చప్పుడైంది.

భళ్ళున తెరుచుకుంది తలుపు. గుమ్మంలో నిల్చున్న

అర్జున్ని చూసి నిర్ఘాంతపోయాడు ఇన్‌స్పెక్టర్. అతని చేతిలో పిస్తోళ్ళున్నాయి.

"మద్రాసునించి వాణ్ని వెంబడిస్తూ వచ్చాను. ఇక్కడికి రాగానే వాడు మొహానికి ముసుగు తొడుక్కుని యింట్లో ప్రవేశించాడు. వాడివెనక నేనూ లోనికి రావాలా, బయటేవుండి యెదురుచూడాలా అని ఇంకా ఆలోచిస్తుండగానే, లోపల పిస్తోలు కాల్పులు వినిపించాయి.

ఇంకేమీ ఆలోచించకుండా లోపలకి పరిగెత్తుకొని వచ్చాను. అదేక్షణంలో వాడీగది తలుపుమూసి గడియ పెట్టి వెనుదిరిగాడు. క్షణం వృథా చెయ్యకుండా, నా పిస్తోలు గురిపెట్టి కాల్చాను. గుళ్ళు కుడిచేతిలోనూ, తొడలోనూ దిగాయి. గావుకేక పెడుతూ కిందకూలాడు. వెంటనే వాడి చేతిలోంచి ఈ పిస్తోలు స్వాధీనం చేసుకొన్నాను" అన్నాడు అర్జున్.

ముగ్గురూ గబగబ నడవాలో కెళ్ళి చూశారు.

ఆ ముసుగుమనిషి కిందపడి మూలుగుతున్నాడు. దుర్యోధన్ వంగి, అతని మొహంమీది ముసుగు లాగేశాడు. అంతే! దిగ్భ్రాంతితో ఇన్‌స్పెక్టర్ నోరు తెరుచుకుంది.

"జయదీప్! నువ్వా?" అన్నాడు నమ్మశక్యంగాక.

"ఔను, అక్షరాలా అతనే! ఎప్పుడయితే మంజునాథ్ షాపులో శివానందం హత్య జరిగిందో అప్పుడే నా అనుమానం ఇతనిమీదికి మళ్ళింది. శివానందంవంటి అనుభవశాలి అనుమానాస్పదులు షాపులో ప్రవేశించినా, అలారమ్ బటన్ వత్తకుండా తన వెనక్కి వచ్చి దాడిచేసే వరకూ ఊరుకుంటాడా?

ఎంతో పరిచయమున్న వాడైతేనే అతను కూర్చున్న

కాంటనెల్లో ప్రవేశించి, మాయామాటలమధ్య అతనిపై చావుదెబ్బ తీయగలడు. అతనికంతగా పరిచయమున్న వ్యక్తి యెవరు? దేనికయినా మంచిదని యితన్నొకంట కనిపెట్టడానికి అర్జున్ని నియమించాను" అన్నాడు దుర్యోధన్.

"రాత్రి ఒంటిగంట సమయంలో ఇతను కణ్ణదాసన్ యింటికెళ్ళి చీకట్లో మొహానికి ముసుగు తొడుక్కుని, వెంటిలేటర్ గుండా ఇంట్లో ప్రవేశించాడు. అటుపిమ్మట మేడమీద పిస్తోలు పేలిన చప్పుడు వినిపించింది. కొద్దిసేప టికే ఇతను వెంటిలేటర్ ద్వారా మళ్ళీ బయటపడి, టాక్సీ యెక్కి వడివేలూర్ బయలుదేరాడు. నేనూ టాక్సీలో జాగ్రత్తగా వెంబడిస్తూ వచ్చానిక్కడికి" అన్నాడర్జున్.

"అంటే, కణ్ణదాసన్ని చంపింది సంతోష్ కాదా? మరి అతను ఇంట్లోంచి దేనికి పారిపోయాడు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆ విషయాలు తరువాత. ముందు శవాన్ని, నేరసు డిపి హెడ్క్వార్టర్స్‌కు తీసికెళ్ళే ఏర్పాట్లు చెయ్యాలి. ప్రమోదకు మళ్ళీ మాటవచ్చేసింది. బహుశా, పినతండ్రి మీద కాల్పులు జరిగిన దృశ్యం కళ్ళారా చూడగానే ఆ షాక్ వల్ల కోల్పోయిన ఆమె శక్తులు తిరిగి వచ్చివుంటాయి" అంటూ లోనికి నడిచాడు దుర్యోధన్.

పినతండ్రి శవంముందుకూర్చుని ఇంకా యేడుస్తోంది ప్రమోద. "ఈ లోకంలో నాకు మిగిలిన ఒక్కగా నొక్క బంధువుకూడా నన్ను ఏకాకిని చేసి వెళ్ళిపోయాడు. రెండేళ్ళక్రితం మా అమ్మా, నాన్నా కారులో మద్రాసు వెళుతుండగా, దారిమధ్య ఓ కారు మా వెనుకనుంచి స్పీడుగావచ్చి మా కారును క్రాస్ జేసింది.

దాని డ్రయివింగ్ సీట్లో కూర్చున్న వ్యక్తిని నేను స్పష్టంగా చూశాను. అతని చేతిలో పిస్తోలుంది. మా కారు క్రాస్ చేస్తూ అతను నాన్నమీదికి కాల్పులు జరిపాడు. గుళ్ళు గురితప్పి, విండ్ స్క్రీన్‌కు తగిలాయి. ఆ ఖంగారులో నాన్న చేతిలోని స్టీరింగ్ కంట్రోల్ తప్పి రోడ్డుపక్క చెట్టుకు వేగంగా గుద్దుకుంది కారు.

ముందుసీట్లో కూర్చున్న అమ్మా, నాన్న ఇద్దరూ మరణించారు. బాక్ సీట్లో కూర్చున్న నేను ఆ దృశ్యంచూసి గావుకేక పెట్టాను. అంతే. మళ్ళీ నా నోటిలోంచి మాట పెగల్లేదు. ఏ శబ్దమూ వినిపించలేదు. ఇన్నాళ్ళ తరవాత నా మాటా, వినికిడిశక్తీ యిలా తిరిగి వచ్చాయో ఆశ్చర్యంగా వుంది. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళల్లో తిరుగుతూనే వుంటుంది. ఆ హంతకుడి రూపాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను....” అంది ప్రమోద వెక్కిళ్ళ మధ్య.

సడన్‌గా మెరుపు మెరిసింది దుర్యోధన్ బుర్రలో.

“ఆ వ్యక్తినిచూస్తే గుర్తుపట్టగలవా?” అడిగాడు.

“బహుశా, గుర్తుపట్టగలనేమో!”

“ఇలారా!” అంటూ ఆమెను వెంటబెట్టుకుని నడవాలోకెళ్ళాడు దుర్యోధన్.

కిందపడున్న జయదీప్‌ను లేపి, కూర్చోబెట్టి, “చూడు, పరీక్షగా చూడు. ఆ వ్యక్తి యితనేనా?” అడిగాడు.

ప్రమోద అతన్ని కాసేపు పరీక్షగాచూసి, “యితనే! ఆ నీచుడు ఇతనే!!” అంది దాదాపు అరుస్తూ.

10

క్రయింబ్రాంచి హెడ్‌క్వార్టర్స్ చేరగనే జయదీప్‌ను ఓ కుర్చీలోకితోసి, “చెప్పు! చిత్రహింసలుపెట్టి నిజాలు

కక్కించకనుండే బుద్ధిగా నువ్వుచేసిన నిర్వాకాలన్నీ చెప్పు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజాగడ్డి కటువుగా.

జయదీప్ తల కిందికి వాలిపోయింది. జీవంలేని స్వరముతో చెప్పసాగేడు. "రెండేళ్ళక్రితం కణ్ణదాసన్, దక్షిణామూర్తీ కుట్రపన్ని నాకు డబ్బిచ్చి ప్రమోద తండ్రిని హత్య జేయించారు. ఆ సంతా గుప్పిట్లోకిరాగానే దక్షిణామూర్తి, కణ్ణదాసన్‌కు రెండులక్షలు చెల్లించాడు ప్రతిఫలంగా!

ఆ డబ్బూ, ఆ ఊళ్ళోవున్న ఆస్తిపాస్తులు అమ్మి కణ్ణదాసన్ మద్రాసువచ్చి వజ్రాల దుకాణం తెరిచాడు. నేను విలువయిన స్మగ్లింగ్ వస్తువులు దొంగిలించి అతని కమ్మేవాణ్ణి. అతనా వస్తువులను హెచ్చులాభాలకు రహస్యంగా అమ్మకునేవాడు. మద్రాసులో పేరుపొందిన మంజునాథ్ వజ్రాల దుకాణం కొల్లగొట్టమనీ, దాంతో మనం కుబేరులమవుతామని అతనే నాకు సలహాయిచ్చాడు.

పథకంవేసి, నేర్పుగా మంజునాథ్ షాపులో ఉద్యోగము సంపాదించి, అవకాశం కోసం యెదురుచూడసాగేను. అంతలో, మొన్న అనుకోకుండా దక్షిణామూర్తీ, ప్రమోద ఆ షాపుకి రావడం జరిగింది. కేబిన్‌లో కూర్చున్న నేను వాళ్ళను చూడగానే ఉలిక్కిపడ్డాను.

మైక్‌లోంచి వినబడ్డ వాళ్ళ మాటలనుబట్టి దక్షిణామూర్తి విలువయిన వజ్రాలగుడ్లు అమ్మడానికే అక్కడకి వచ్చాడని తెలిసింది. ఎలాగయినా వాటిని కాజెయ్యాలని నిశ్చయించుకొన్నాను. వెంటనే కేబిన్‌లోంచి కణ్ణదాసన్‌కు ఫోన్‌జేసి, ఆ సంగతి చెప్పాను.

లాయర్ని పిల్చుకొస్తానని దక్షిణామూర్తి బయటకెళ్ళగానే, ఆ విషయంకూడా కణ్ణదాసన్‌కు చెప్పాను. ఆ

తరవాత అతను తిరిగిరాలేదు. మంజునాథ్ సాయంత్రం వరకూ ఎదురుచూసి, తన భార్యను పిల్చి, ప్రమోద నింటికి తీసికెళ్ళమని చెప్పాడు. తరవాత వాళ్ళను వెంబడించమని నన్ను పంపించాడు.

అప్పుడే నాకో ఐడియా తట్టింది. నా అనుచరుడిచేత అతని భార్యనూ, ప్రమోదనూ లొంగదీసుకొని, వాళ్ళ ప్రాణాలు బేరం పెట్టి, ఆ వజ్రాలగుట్టు కాజేయాలనుకొన్నాను. అనుకున్న ప్రకారం నా సహచరుడు వాళ్ళ యింట్లో ప్రవేశించి ఆడవాళ్ళను లొంగదీసుకొన్నాడు. నేను బయట క్రోటన్ పొదలమధ్య నిల్చుని చూడసాగేను....

తరవాత మంజునాథ్ వచ్చాడు. కొంతసేపటికి లోపల పిస్తోలు పేలినశబ్దం వినిపించింది. అప్పుడే డిటెక్టివ్ దుర్యోధన్ వచ్చారక్కడకి. దాంతో, నా ప్లాన్ బెడిసికొట్టిందని గ్రహించి, నాకు నేనే తలమీద కొట్టుకొని, స్పృహ తప్పినట్లు కిందపడిపోయాను....

నా మిత్రుడు పట్టుబడిపోయాడు. వాడు నోరు విప్పడని నాకు బాగా తెలుసు.

ఆ తరవాత సంతోష్ వచ్చాడు. అతనంటే నాకు మొదటినుంచీ పరమద్వేషం! ఇంట్లోంచి అతను వెళ్ళిపోగానే, మీదగ్గర సెలవు తీసుకొని నేనూ అతని వెనక బయటకివచ్చి వెంబడించాను.

సంతోష్ తిన్నగా వడివేలూర్ చేరుకున్నాడు. అంతకు ముందే అక్కడ దక్షిణామూర్తి నోకంట కనిపెట్టటానికి కణ్ణదాసన్ యిద్దరు రౌడీలను నియమించాడని అతనికి తెలీదు. సంతోష్ ఆ ఇంట్లో దేనికి ప్రవేశించాడో నాకు తెలీదు. అతను కణ్ణదాసన్ పెంపుడు కొడుకే అయినా,

తండ్రి చేసే అక్రమ వ్యవహారాలతో అతనికి సంబంధం లేదు.

ఆ ఇంట్లో విలువయిన ఆభరణాలు రహస్యంగా దాచ బడి వున్నాయనీ, ఆ రహస్యప్రదేశం కనుగొని, వాటిని కాజేద్దామని నాకు బుద్ధిపుట్టింది.

చడీ చప్పుడూ కాకుండా ఆ ఇల్లు చేరుకొన్నాను. ఇంట్లో ప్రవేశించిన కొద్దిసేపటికే గూర్ఖా నన్ను చూశాడు. వాణ్ని ప్రాణాలతో వుంచకూడదని గుండెలో ఈటె దింపి చంపేశాను. ఆ హత్యానేరం సంతోష్ మీద కెళ్తుందని ఊహించాను....

హాస్పిటల్లో మంజునాథ్ మిమ్మల్ని షాపుకెళ్ళి ఆ వజ్రాల గుడ్లను చూసిరమ్మని, సీక్రెట్ సేఫ్ నెంబర్లు రాసి యివ్వగానే, నాలో మరో ఆశాకిరణం మెరిసింది. మీరు నన్ను కణ్ణదాసన్ షాపుకెళ్ళి అతని గురించి వాకబు చెయ్యమని పంపారు. అటు వెళ్ళినట్టు వెళ్ళి, నా సహచరుణ్ని వెంటబెట్టుకొని మీ వెనకే మంజునాథ్ షాపుకెళ్ళాను.

కౌంటరులో కూర్చున్న శివానందానికి, నా మిత్రుణ్ని మీ అసిస్టెంటుగా పరిచయంచేసి, అతను మిమ్మల్ని కలుసుకోడానికి వచ్చినట్టు లోపలకిపంపి, శివానందంతో బాతాఖానీ కొడుతూ, కౌంటరులో ప్రవేశించి, వెనక నుంచి పిస్తోలు మడమతో అతని తల పగలగొట్టాను.

అంతలో—లోపల మీరు నా మిత్రుడితో కలయ బడుతున్నట్టు శబ్దాలు వినిపించాయి. వాడు మీ ముందు చిత్తయిపోయినట్టు పసిగట్టి వెంటనే అక్కణ్నుంచి పారి పోయాను....

వడివేలూర్ లోని దక్షిణామూర్తి ఇంట్లో గూర్ఖా హత్యచెయ్యబడ్డట్టు తెలియగానే కణ్ణదాసన్ కు నామీద

అనుమానం వేసింది - ఆ స్థావరాలు నేనొక్కడినే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నా నేమోనని.

నన్ను పిలిపించి నానా మాటలూ అన్నాడు. ఇటు వంటి వెర్రివేషాలేస్తే నా రహస్యాలన్నీ బయటపెడతానని బెదిరించాడు. దాంతో, ఆ రాత్రికి రాత్రే వాడిపని ఆఖరు చెయ్యాలని నిశ్చయించుకొన్నాను.

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో, వెంటిలేటర్ గుండా ఇంటిలో ప్రవేశించి, పడగ్గదిలో నిద్రిస్తున్న కణ్ణదాసన్ ని రెండుసార్లు షూట్ చేశాను. ఆ చప్పుళ్ళకు పక్కగదిలో పడుకున్న సంతోష్ పరిగెత్తుకొచ్చాడక్కడికి. నా చేతిలో వున్న పిస్తోలు అతనివైపు విసిరి, పరుగు లంకించాను....

అక్కణ్ణించి తిన్నగా వడివేలూర్ వెళ్ళి, నా రహస్యాలు తెలిసిన దక్షిణామూర్తిని కూడా తుదముట్టించాలనుకున్నాను" జయదీప్ మాట పూర్తికాకముందే సార్జంట్ డేవిడ్ లోపలికివచ్చి, "సార్! మీకోసం ఎవరో వచ్చారు" అన్నాడు ఇన్ స్పెక్టర్ తో.

"ఎవరు? లోపలకి రమ్మను" అన్నాడు ఇన్ స్పెక్టర్.

లోపలికివచ్చిన వ్యక్తిని చూడగానే అందరూ నివ్వెరపోయారు. "సంతోష్! నువ్వా!!" అన్నాడు ఇన్ స్పెక్టర్ ఆశ్చర్యంగా.

సంతోష్ తలూపి, "ఔను ఇన్ స్పెక్టర్ గారూ! రాత్రి ఎవ్వడో ముసుగుమనిషి మా ఇంట్లో ప్రవేశించి, నా తండ్రిని చంపి, పిస్తోలు నామీదకి విసిరి పారిపోయాడు. నేనింకా ఆ షాక్ లోంచి తేరుకోకముందే నా తల్లి అక్కడికివచ్చి, పిస్తోలుతో వున్న నన్ను చూసి. హత్య నేనే చేశానని అపోహపడింది.

నా కేటూ పాలుపోక, అక్కణ్ణించి పారిపోయాను,

రాత్రంతా ఒకచోట దాక్కుని ఆలోచించాను. అలా పారిపోవడంవల్ల నా మీద అనుమానం యింకా బలపడు తుందనీ, మిమ్మల్ని కలుసుకుని జరిగిందంతా చెప్పి నమ్మిం చాలని ఇలా వచ్చాను" అన్నాడు.

"అదిసరే, మొన్న రాత్రి దక్షిణామూర్తి యింట్లో దొంగచాటుగా దేనికి ప్రవేశించావ్?" అడిగేడు యిన్స్పెక్టర్.

"ఆయన ప్రమోదకు చెందవలసిన ఆస్తిపాస్తులూ, ఆభరణాలూ దుర్వినియోగం చేస్తున్నాడన్న అపోహలు వ్యాపించి వుండటంవల్ల ఆయనమీద నేరం నిరూపించే ఆధారాలూ, కాగితాలూ ఏవయినా దొరుకుతాయేమో నని వెళ్ళానక్కడికి. అంతకుమించి వేరే దురుద్దేశం ఏమీ లేదు నాలో!" అన్నాడు సంతోష్ నీరసంగా.

ప్రమోద కళ్ళు జాలిగా చూస్తున్నాయతని వైపు.

—:ఐపోయింది:—